




# పెన్ పవర్


తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 358 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం ఆదివారం 31 ఆగస్టు 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :358 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SUN 31 AUGUST 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Prakasam, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur




## ట్రంప్ వల్ల అమెరికా పరువు పోతోంది.. భారత్‌ను చైనా వైపు నెడుతున్నారు

### యూఎస్ మాజీ అధికారులు ఫైర్

- భారత్‌పై ట్రంప్ విధించిన భారీ సుంకాలపై తీవ్ర వ్యతిరేకత
- ట్రంప్ విధానాలు అమెరికా ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయన్న మాజీ జాతీయ భద్రతా సలహాదారు
- అమెరికా కంటే చైనా బాధ్యతాయుతమైన దేశంగా కనిపిస్తోందని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వి ధించిన భారీ సుంకాలపై సొంత దేశంలోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ట్రంప్

వివరాలు 2లో..

## రాయలసీమకు నీళ్లు వస్తే వైసీపీ వాళ్లు జీర్ణించుకోలేకపోతున్నారు






- రాష్ట్ర అభివృద్ధికి కొందరు రాక్షసుల్లా అడ్డుపడుతున్నారని సీఎం చంద్రబాబు తీవ్ర విమర్శ
- కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు కృష్ణా జలాలు విడుదల.. పరమసముద్రం చెరువు వద్ద జలహారతి
- రాయలసీమకు నీళ్లొస్తే వైసీపీకి అస్సలు జీర్ణం కావడం లేదని ధ్వజం
- పోలవరం-బనకచర్ల అనుసంధానంతో కరవుకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ
- 'స్త్రీ శక్తి'తో ఇబ్బంది పడుతున్న ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని భరోసా
- ఎనిమిది సార్లు గెలిపించిన కుప్పం ప్రజల రుణం తీర్చుకుంటానని ఉద్వేగం



పెన్ పవర్ డెస్క్:"రాష్ట్ర అభివృద్ధి అనే యజ్ఞాన్ని అడ్డుకునేందుకు కొందరు రాక్షసుల్లా తయారయ్యారు. ప్రతి మంచి పనికీ తప్పుడు ప్రచారాలతో అడ్డంకులు సృష్టిస్తున్నారు. చేతనైతే అభివృద్ధి, సంక్షేమంలో మాతో పోటీ పడాలి తప్ప, ఇలాంటి కుట్ర రాజకీయాలు చేయడం సరికాదు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపక్ష వైసీపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దశాబ్దాల కుప్పం ప్రజల కలను సాకారం చేస్తూ, హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలను నియోజకవర్గానికి తీసుకువచ్చిన చారిత్రక సందర్భంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాయలసీమకు నీళ్లు వస్తుంటే వైసీపీ నేతలకు ఏమాత్రం జీర్ణం కావడం లేదని, వారిది నాటకాలు ఆడే నైజమైతే, తమది నీళ్లు తెచ్చి ప్రజల దాహార్తి తీర్చే విధానమని ఆయన స్పష్టం చేశారు. శనివారం కుప్పం నియోజకవర్గంలోని పరమసముద్రం చెరువు వద్దకు చేరుకున్న కృష్ణా జలాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు సంప్రదాయ పంచెకట్టులో వేదమంత్రోచ్చారణల మధ్య పసుపు, కుంకుమలు సమర్పించి ఘనంగా జలహారతి ఇచ్చారు. అంతకుముందు, తన నివాసం నుంచి మహిళలు, రైతులతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. "నన్ను ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా గెలిపించి అక్కున చేర్చుకున్న నా కుప్పం ప్రజల రుణం తీర్చుకునే అవకాశం దక్కింది. కుప్పం చివరి భూములకు కృష్ణా జలాలను తీసుకురావడంతో నా జన్మ ధన్యమైంది. నా సంకల్పం నెరవేరింది. 2028లో కృష్ణా పుష్కరాలు వస్తే, కుప్పానికి మాత్రం రెండేళ్లు ముందే పండుగ వచ్చింది" అని ఆనందం వ్యక్తం చేశారు.

వివరాలు 2లో..



## విభిన్న ప్రతిభావంతుల సమస్యలను కేబినెట్ లో చర్చిస్తాం

- విశాఖలో ఉప ముఖ్యమంత్రి పవన్‌ను కలిసిన దివ్యాంగులు
- తమ సమస్యలపై వినతిపత్రం అందజేత
- జీవో నంబర్ 2 సవరణ, వ్యక్తిగత రేషన్ కార్డుల మంజూరుపై విజ్ఞప్తి
- సమస్యలను కేబినెట్‌లో చర్చిస్తానని పవన్ హామీ
- ఆటో డ్రైవర్ల సమస్యలపైనా డిప్యూటీ సీఎంకు వినతి
- స్త్రీ శక్తి పథకంతో తగ్గిన ఆదాయంపై ఆటో డ్రైవర్ల ఆవేదన

పెన్ పవర్ డెస్క్:ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. విశాఖపట్నం పర్యటనలో భాగంగా తనను కలిసిన విభిన్న ప్రతిభావంతులు, ఆటో డ్రైవర్ల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలను మంత్రివర్గ సమావేశంలో చర్చించి, పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు.శనివారం నాడు విశాఖలో విజువల్లీ ఛాలెంజ్డ్ యూత్ అసోసియేషన్ సభ్యులు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసి తమ ఇబ్బందులను విన్నవించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 2ను సవరించి, రోస్టర్ పాయింట్ 6ను జనరల్ కేటగిరీకి మార్చాలని కోరారు. ఈ మార్పు వల్ల, అర్హులైన అంధ పురుష అభ్యర్థులకు కూడా ఉద్యోగావకాశాల్లో మేలు జరుగుతుందని వారు వివరించారు.దీనితో పాటు, విభిన్న ప్రతిభావంతులకు వ్యక్తిగత రేషన్ కార్డులు మంజూరు చేస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతాయని

వివరాలు 2లో..

## రుషికొండ భవనాల కోసం చంద్రబాబు, పవన్, లోకేశ్ మధ్య పోటీ



- సమస్యలను పక్కదారి పట్టించేందుకు రుషికొండ అంశాన్ని తెరపైకి తెచ్చారన్న అమర్నాథ్
- పవన్, నాదెండ్ల మనోహర్ రుషికొండ వద్ద ఫొటో షూట్ నిర్వహించారని విమర్శ
- విశాఖ స్టీల్ ప్లాంట్ పై పవన్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్న

వివరాలు 2లో..

## కుప్పానికి నీళ్లిచ్చింది జగన్... చంద్రబాబు క్రెడిట్ కొట్టేయాలనుకుంటున్నారు

### పోలవరం పనుల్లో తీవ్ర లోపాలున్నాయన్న అంబటి

### డయాఫ్రం వాల్ దెబ్బతినడానికి చంద్రబాబే కారణమని ఆరోపణ

### కమీషన్ల కోసమే చంద్రబాబు ఆరాటపడుతున్నారని విమర్శ



పెన్ పవర్ డెస్క్:పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు సక్రమంగా జరగడం లేదని, దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు గత, ప్రస్తుత విధా నాలే కారణమని వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాల యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.గతంలో చంద్రబాబు

వివరాలు 2లో..

## కోటంరెడ్డి హత్య కుట్ర ఓ పెద్ద నాటకం.. వీడియోలో ఉన్నది వాళ్ల మనుషులే



- రౌడీషీటర్ కు పెరోల్ ఇప్పించే విషయంలో కోటంరెడ్డి అడ్డంగా బుక్కయ్యారన్న కాకాణి
- పెరోల్ వివాదం నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ డ్రామా అని విమర్శ
- దమ్ముంటే హత్య కుట్రపై సీబీఐ విచారణ జరిపించాలని సవాల్

పెన్ పవర్ డెస్క్:టీడీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హత్యకు కుట్ర జరుగుతోందంటూ ఓ వీడియో వైరల్ కావడంపై వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తీవ్రస్థాయి లో స్పందించారు. అదంతా కోటంరెడ్డి ఆడుతున్న పెద్ద నాటకమని, నాటకాలు

వివరాలు 2లో..

## నా హత్యకు కుట్ర.. ఆ వీడియో చూసి షాకయ్యా



- తన హత్యకు కుట్ర పన్నిన వీడియోపై స్పందించిన ఎమ్మెల్యే కోటంరెడ్డి
- కొందరు రౌడీషీటర్లు తనను చంపేందుకు పథకం వేశారని వెల్లడి
- బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేసిన శ్రీధర్ రెడ్డి

పెన్ పవర్ డెస్క్:తనను హత్య చేసేందుకు కుట్ర పన్నినట్లుగా ఉన్న ఓ వీడియో బయటకు రావడంపై నెల్లూరు రూరల్ టీడీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఇలాంటి బెదిరింపులకు తాను భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ కుట్ర వీడియోపై మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, పలు సంచలన ఆరోపణలు చేశారు. నిన్న సాయంత్రం ఓ న్యూస్ ఛానల్‌లో ప్రసారమైన వీడియో చూసి

వివరాలు 2లో..

## తాడిపత్రికి వెళ్లనున్న పెద్దారెడ్డి: జేసీ ప్రభాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



- తాడిపత్రికి వెళ్లేందుకు పెద్దారెడ్డికి సుప్రీంకోర్టు అనుమతి
- పెద్దారెడ్డిని అడ్డుకుంటున్నది బాధితులేనని వ్యాఖ్య
- గతంలో పెద్దారెడ్డి దౌర్జన్యాలకు పాల్పడ్డారని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:తాడిపత్రి నియోజకవర్గంలో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. వైసీపీ నేత కేతిరెడ్డి పెద్దారెడ్డికి తాడిపత్రిలోకి ప్రవేశించేందుకు సుప్రీంకోర్టు అనుమతి ఇవ్వడంపై టీడీపీ నేత, మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. పెద్దారెడ్డి రాకను తాను

వివరాలు 2లో..

## వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పురస్కారం అందుకున్న బాలయ్య...

### హాజరైన బండి సంజయ్, నారా లోకేశ్




- భారత సినీ చరిత్రలో బాలయ్య సరికొత్త రికార్డ్
- వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు
- 50 ఏళ్ల సినీ ప్రస్థానానికి గాను దక్కిన ప్రతిష్ఠాత్మక అవార్డు

పెన్ పవర్ డెస్క్: ప్రముఖ నటుడు, హిందూపురం శాసనసభ్యుడు బాలకృష్ణ తన సినీ జీవితంలో ఒక అరుదైన మైలురాయిని అందుకున్నారు. ఆయన ప్రతిష్ఠాత్మకమైన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (గోల్డ్ ఎడిషన్)లో స్థానం సంపాదించారు. భారత చలన చిత్ర పరిశ్రమ నుంచి ఈ పురస్కారానికి ఎంపికైన తొలి నటుడిగా ఆయన అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. 50 ఏళ్లుగా చిత్ర పరిశ్రమకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా బాలకృష్ణకు ఈ గౌరవం దక్కింది.హైదరాబాద్‌లో వైభవంగా జరిగిన ఒక కార్యక్రమంలో బాలకృష్ణ ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, ఆంధ్రప్రదేశ్ ఐటీ,

వివరాలు 2లో..

## మిత్రులు, శత్రువులు శాశ్వతం కాదు.. దేశ ప్రయోజనాలే ముఖ్యం

- అమెరికా సుంకాల బెదిరింపులపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటు వ్యాఖ్యలు
- అంతర్జాతీయ సంబంధాల్లో శాశ్వత మిత్రులు, శత్రువులు ఉండరన్న రాజ్‌నాథ్
- దేశ ప్రయోజనాలే తమకు ముఖ్యమని స్పష్టీకరణ
- రైతులు, వ్యాపారుల సంక్షేమం విషయంలో రాజీపడేది లేదని వెల్లడి
- ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదని తేల్చిచెప్పిన రక్షణ మంత్రి

పెన్ పవర్ డెస్క్:అంతర్జాతీయ సంబంధాలలో శాశ్వత మిత్రులు గానీ, శాశ్వత శత్రువులు గానీ ఉండరని, కేవలం దేశ శాశ్వత ప్రయోజనాలు మాత్రమే ఉంటాయని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పెంపు బెదిరింపుల నేపథ్యంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఎంతటి ఒత్తిడి ఎదురైనా దేశ ప్రజలు, రైతుల ప్రయోజనాల

వివరాలు 2లో..



# రుషికొండ భవనాల కోసం చంద్రబాబు, పవన్, లోకేశ్ మధ్య పోటీ

విశాఖలోని రుషికొండపై నిర్మించిన భవనాలను ఎవరు వాడుకోవాలనే దానిపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ మధ్య తీవ్రమైన పోటీ నెలకొందని మాజీ మంత్రి, వైసీపీ నేత గుడివాడ అమర్నాథ్ ఆరోపించారు. రాష్ట్రంలో అసలు సమస్యలను పక్కదారి పట్టించేందుకే కూటమి ప్రభుత్వం రుషికొండ అంశాన్ని తెరపైకి తెచ్చిందని, పవన్ కల్యాణ్ అక్కడ పర్యటించడం కేవలం ఓ డ్రామా అని ఆయన విమర్శించారు. విశాఖలో మీడియాతో మాట్లాడిన అమర్నాథ్, కూటమి నేతల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల సమయంలో రుషికొండ భవనాలను 'జగన్ ప్యాలెస్' అంటూ దుష్ప్రచారం చేసిన కూటమి నేతలు, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక విడుదల చేసిన జీవోలో 'పర్యాటక రిసార్ట్' అని ఎందుకు పేర్కొన్నారని అమర్నాథ్ ప్రశ్నించారు. "ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించడానికే పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్ రుషికొండ వద్ద ఫోటో షూట్ నిర్వహించారు. భవనం సీలింగ్‌ను కత్తిరించి, ఆ ప్రాంతంలో ఫొటోలు తీసుకున్నారు" అని ఆయన ఎద్దేవా చేశారు. చిన్నపాటి వర్షానికే కారిపోతున్న అమరావతిలోని తాత్కాలిక సచివాలయం దుస్థితి పవన్‌కు కనిపించడం లేదా? అని నిలదీశారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ అంశాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని అమర్నాథ్ మండిపడ్డారు. "విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని మాట్లాడిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇప్పుడు కర్మాగారాన్ని అమ్మేస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారు? వేలాది మంది కార్మికులు రోడ్డున పడితే వారి గురించి పట్టించుకోవడం లేదు" అని దుయ్యబట్టారు. కేవలం ఈవెంట్ల కోసం విశాఖను, పేమెంట్ల కోసం అమరావతిని వాడుకుంటున్నారని ఆరోపించారు.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తమ పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని అమర్నాథ్ స్పష్టం చేశారు. జగన్ వల్లే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగిందని కేంద్ర మంత్రి చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ప్రజల సమస్యలను గాలికొదిలేసిందని విమర్శించారు. త్వరలోనే స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం తమ పార్టీ ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తుందని ఆయన తెలిపారు.

# ఎడిటర్ వ్యూ

## డిప్రెషన్ లో ఉన్నప్పుడు ఏంతినాలి.. ఏం తినకూడదు..!

తిండిపైనే ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. కేవలం శారీరక ఆరోగ్యాన్నే కాదు మానసిక ఆరోగ్యాన్ని కూడా ఫుడ్ హ్యాబిట్సే డిసైడ్ చేస్తాయి. సంతోషం, బాధ, కోపం, డిప్రెషన్.. ఇలా ఎమోషన్ ఏదైనా సరే తినే ఫుడ్ తోనే లింక్ అయి ఉంటుంది బ్రెయిన్? కి, డైజెషన్ ట్రాక్? కి చాలా దగ్గరి సంబంధం ఉంటుంది. డైజెషన్ ట్రాక్ లో కొన్ని బిలియన్ల సూక్ష్మ జీవులు ఉంటాయి. అవి పేగుల నుంచి బ్రెయిన్, మెసేజ్ పంపించే న్యూరోట్రాన్స మీటర్? ను తయారుచేస్తాయి. కడుపునిండా తిన్నప్పుడు ఆ న్యూరో ట్రాన్స్? మీటర్స్ పర్ఫెక్ట్ షేప్? లో ఉండి.. బ్రెయిన్? కు మెసేజ్ పంపుతాయి. దానివల్ల హెల్దీ బ్యాక్టీరియా రిలీజ్ అవుతుంది. అది డోపమైన్, సెరటోనిన్ అనే హ్యాపీ హార్మోన్లను రిలీజ్ చేస్తుంది. కానీ, నూడిల్స్, బర్గర్ లాంటి ఫాస్ట్? ఫుడ్స్ తింటే న్యూరోట్రాన్స్? మీటర్స్ షేప్ లో తేడా వస్తుంది. బ్రెయిన్? కి సరిగా మెసేజ్ అందదు. దానివల్ల మూడ్? స్వింగ్స్, ఏదో ఒకటి తినాలనిపించే ఆలోచనలు చుట్టుముడతాయి. కాస్త డిప్రెషన్లో ఉన్నప్పుడు అవి మరింత పెరుగుతాయి. అందుకే డ్రిప్రెషన్లో ఉన్నప్పుడు తినాల్సిన, తినకూడని ఫుడ్ ఏంటో ఫేమస్ న్యూట్రిషనిస్ట్ లు చెప్తున్నారు.

### ఏమేం తినాలి?

కాస్త ముభావంగా అనిపిస్తుంటే వాల్? నట్స్ తినాలి. వీటిల్లోని ఒమెగా –3 ఫ్యాటీ యాసిడ్స్ బ్రెయిన్ ఫంక్షనింగ్ ని సపోర్ట్ చేస్తాయి. డ్రిపెషన్ సింప్టమ్స్ ని తగ్గిస్తాయి. అలాగే ఒమెగా –3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉండే అవిసె గింజలు. పాదరసం లేని సాల్మన్ ఫిష్, చియా సీడ్స్ తినాలి. వీటిల్లో ఉండే ఫోలేట్, మెలటోనిన్, విటమిన్–ఇ. యాంటీ ఆక్సిడెంట్స్ న్యూరోప్రొటక్టివ్ కాంపౌండ్స్ గా పనిచేసి డిప్రెషన్? ని కంట్రోల్ చేస్తాయి.

డిప్రెషన్లో ఉన్నప్పుడు బీన్స్ ని డైట్ లో పక్కాగా చేర్చాలి. వీటిల్లోని జింక్,
కాపర్, మాంగనీస్, సెలీనియం. విటమిన్–బి1, బి6, ఇ.కె లు షుగర్ లెవల్స్? ని కంట్రోల్ చేసి చే మూడ్ స్వింగ్స్ కి బ్రేక్ వేస్తాయి.

క్యాబేజీ పచ్చడి, పెరుగు, జున్నులాంటి ప్రొ–బయోటిక్స్ ఎక్కువగా ఉండే ఫుడ్ తినడం వల్ల డిప్రెషన్ నుంచి బయటపడొచ్చు. అలాగే యాంటీ ఆక్సిడెంట్స్, ఫ్లేవనాయిడ్స్, మెగ్నీషియం ఎక్కువగా ఉండే డార్క్ చాక్లెట్స్ తిన్నా మూడ్ స్వింగ్స్ దరిచేరవు. ఇవి మెనోపాజ్ మూడ్ స్వింగ్స్, ప్రి మెనుస్ట్రువల్ సిండ్రోమ్ ని కూడా కంట్రోల్ చేస్తాయి.

అన్ని రకాల కూరగాయలు, ధాన్యాల్లో హెల్దీ కార్బోహైడ్రేట్స్ ఉంటాయి. ఇవి మైండ్?ని కామ్ చేస్తాయి. వీటిల్లోని సెరటోనిన్ అనే మూడ్ బూస్టర్ డిప్రెషన్ నుంచి బయటపడేస్తుంది. పసుపులో కొంచెం బ్లాక్ పెప్పర్ ఒక టేబుల్ స్పూన్ కొబ్బరి నూనె లేదా నెయ్యి కలుపుకుని తాగినా బ్రెయిన్ డిజార్డర్స్ నుంచి బయటపడొచ్చు..

### ఇవి తినొద్దు

డిప్రెషన్ లో ఉన్నప్పుడు చక్కెర శాతం ఎక్కువగా ఉండే ఫుడ్ జోలికి అస్సలు వెళ్లకూడదు. మరీ ముఖ్యంగా వైట్ బ్రెడ్స్? కి దూరంగా ఉండాలి. ఇవి వెంటనే బ్లడ్? లో షుగర్ లెవల్స్? ను పెంచుతాయి. అలాగే కెఫిన్ ఎక్కువగా ఉండే కాఫీలు తాగకూడదు. ఇవి నిద్రని దూరం చేసి మూడ్ స్వింగ్స్ ని మరింత పెంచుతాయి. డిప్రెషన్? లో ఉన్నప్పుడు బ్యాలెన్స్ డైట్ ఫాలో అవ్వాలి

# ట్రంప్ వల్ల అమెరికా పరువు పోతోంది.. భారత్‌ను చైనా వైపు నెడుతున్నారు

- మొదటి పేజీ తరువాయి

అనుసరిస్తున్న మొండి విధానాలు అమెరికా బ్రాండ్ ప్రతిష్ఠను దెబ్బతీయడమే కాకుండా, వ్యూహాత్మకంగా కీలకమైన భారత్‌ను చైనాకు దగ్గర చేస్తున్నాయని వైట్‌హౌస్ మాజీ ఉన్నతాధికారి, గతంలో అధ్యక్షుడు జో బైడెన్‌కు జాతీయ భద్రతా సలహాదారుగా పనిచేసిన జేక్ సలివాన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇటీవల 'ది బల్వార్క్' అనే పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన సలివాన్, ట్రంప్ విధానాల వల్ల అంతర్జాతీయంగా అమెరికా పలుచనైపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. "ఏడాది క్రితం లేనివిధంగా ఇప్పుడు చాలా దేశాల్లో అమెరికా కంటే చైనాయే ప్రజాదరణ పొందుతోంది. అమెరికా బ్రాండ్ ప్రతిష్ఠ మంటగలిసిపోతుండగా, చైనా మరింత బాధ్యతాయుతమైన దేశంగా కనిపిస్తోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్ చర్యల వల్ల మిత్రదేశాలు అమెరికాను నమ్మలేని ఓ పెద్ద ఆటంకంగా చూస్తున్నాయని, అందుకే అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని భావిస్తున్నాయని ఆయన తెలిపారు. భారత్‌తో లోతైన, స్థిరమైన సంబంధాన్ని నిర్మించుకోవడానికి తాము ప్రయత్నిస్తే, ట్రంప్ మాత్రం ఆ దేశంపై భారీ వాణిజ్య యుద్ధం ప్రకటించారని సలివాన్ విమర్శించారు. "ఈ పరిస్థితుల్లో, అమెరికాకు ప్రత్యామ్నాయంగా బీజింగ్‌తో చర్చలు జరపాల్సి వస్తుందేమోనని భారత్ ఆలోచించే ప్రమాదం ఉంది" అని ఆయన హెచ్చరించారు.

భారత్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై అధ్యక్షుడు ట్రంప్ సుంకాలను 50 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. అన్యాయమైన వాణిజ్య పద్ధతులు, రష్యా నుంచి ముడి చమురు దిగుమతిని నిలిపివేయకపోవడమే ఇందుకు కారణమని ట్రంప్ ప్రభుత్వం అధికారికంగా చెబుతోంది. అయితే, పాకిస్థాన్‌తో వివాదంలో మధ్యవర్తిత్వం చేస్తానన్న ట్రంప్ ప్రతిపాదనను భారత్ తిరస్కరించినందుకే ఈ సుంకాలను విధించారన్న కథనాలు కూడా వినిపిస్తున్నాయి.

ట్రంప్ విధానాలను కేవలం సలివాన్ మాత్రమే కాకుండా, గతంలో అమెరికా ప్రభుత్వంలో పనిచేసిన పలువురు ఉన్నతాధికారులు కూడా తీవ్రంగా తప్పుబడుతున్నారు. ఒబామా హయాంలో విదేశాంగ మంత్రిగా పనిచేసిన జాన్ కెర్రీ, "గొప్ప దేశాలు బెదిరింపులకు పాల్పడవు, దౌత్యపరంగా ప్రయత్నిస్తాయి" అంటూ గతవారమే ట్రంప్ విధానాలను విమర్శించారు. అదేవిధంగా, ట్రంప్ మాజీ సహాయకుడు జాన్ బోల్టన్ కూడా స్పందిస్తూ, దశాబ్దాలుగా రష్యా, చైనాల నుంచి భారత్‌ను దూరం చేసేందుకు అమెరికా చేసిన ప్రయత్నాలను ట్రంప్ ప్రమాదంలో పడేశారని మండిపడ్డారు.

# విభిన్న ప్రతిభావంతుల సమస్యలను కేబినెట్ లో చర్చిస్తాం

- మొదటి పేజీ తరువాయి

విజ్ఞప్తి చేశారు. సామాజిక పింఛన్ల పంపిణీలో ఎదురవుతున్న సమస్యలను కూడా వారు పవన్ దృష్టికి తీసుకెళ్లారు. వారి సమస్యలను ఓపికగా విన్న పవన్, ఈ అంశాలన్నింటినీ కేబినెట్ సమావేశంలో ప్రస్తావించి, పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

అదేవిధంగా, విశాఖపట్నానికి చెందిన పలువురు ఆటో డ్రైవర్లు కూడా వినతి పత్రం సమర్పించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'స్త్రీ శక్తి' పథకం వల్ల ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో తమ ఆదాయం గణనీయంగా తగ్గిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన పవన్ కల్యాణ్, 'స్త్రీ శక్తి' పథకం అనేది సూపర్ సిక్స్ హామీలలో భాగమని, మహిళలకు ఆర్థికంగా అండగా నిలవాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. అయితే, ఆటో డ్రైవర్ల ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు పెంచుకునే అంశాన్ని, వారు ప్రస్తావించిన ఇతర సమస్యలను కూడా మంత్రివర్గం దృష్టికి తీసుకువెళతానని తెలిపారు.

# కోటంరెడ్డి హత్య కుట్ర ఓ పెద్ద నాటకం.. వీడియోలో ఉన్నది వాళ్ల మనుషులే

- మొదటి పేజీ తరువాయి

ఆడటంలో ఆయనకు నంబర్ వన్ ర్యాంక్ ఇవ్వొచ్చని ఎద్దేవా చేశారు. ఒక రౌడీషీటర్‌కు పెరోల్ ఇప్పించే విషయంలో అడ్డంగా దొరికిపోయినందునే, ఆ అంశం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఈ కొత్త డ్రామాకు తెరలేపారని ఆయన ఆరోపించారు.

రౌడీ గ్యాంగ్‌లను పెంచి పోషించిందే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కాదా? అని కాకాణి ప్రశ్నించారు. రౌడీషీటర్ శ్రీకాంత్‌కు పెరోల్ ఇచ్చే విషయంలో హోంమంత్రి వంగలపూడి అనిత ఎవరి ప్రలోభాలకు లొంగి సంతకం పెట్టారు? అని నిలదీశారు. ప్రస్తుతం వైరల్ అవుతున్న వీడియోలో ఉన్న వ్యక్తులంతా ఎమ్మెల్యే కోటంరెడ్డి, మరో టీడీపీ నేత రూప్‌కు సంబంధించిన మనుషులేనని ఆరోపించారు. ఈ వ్యవహారంలో వైసీపీ ప్రమేయం ఉందని టీడీపీ నేతలు సిగ్గుమాలిన విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.

గతంలో ఓ ప్రభుత్వ ఉద్యోగిని బెదిరించి, ఇలాంటి డ్రామాలే ఆడితే నాటి ముఖ్యమంత్రి జగన్ అరెస్ట్ చేయించారని కాకాణి గుర్తుచేశారు. తప్పులు చేసేది టీడీపీ నేతలైతే, కేసులు మాత్రం తమ పార్టీ నేతలపై పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, రౌడీషీటర్ పెరోల్ వ్యవహారంపైనా, ఈ హత్య కుట్ర ఆరోపణలపైనా సీబీఐ విచారణకు ఆదేశించాలని సవాల్ విసిరారు. టీడీపీలో ఏమైనా ఆధిపత్య పోరు ఉంటే దానిని తమపైకి నెట్టవద్దని హితవు పలికారు.

# కుప్పానికి నీళ్లిచ్చింది జగన్... చంద్రబాబు క్రెడిట్ కొట్టేయాలనుకుంటున్నారు

- మొదటి పేజీ తరువాయి

తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్లే పోలవరం డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందని అంబటి ఆరోపించారు. అంతర్జాతీయ నిపుణులు సైతం ఆయన చేసిన పనులకు తలలు పట్టుకున్నారని అన్నారు. "నిబంధనల ప్రకారం డయాఫ్రం వాల్ 1.5 మీటర్ల వెడల్పుతో, రాతి పొర తగిలేంత లోతు వరకు నిర్మించాలి. కానీ గతంలో కేవలం 0.9 మీటర్ల వెడల్పుతోనే కమీషన్ల కోసం కక్కుర్తిపడి నాసిరకంగా కట్టారు" అని ఆయన విమర్శించారు. ఇప్పుడు కూడా పనులు సరైన పద్ధతిలో జరగడం లేదని దుయ్యబట్టారు. కుప్పం నియోజకవర్గానికి నీళ్లు ఇచ్చింది జగన్ అయితే, ఇప్పుడు చంద్రబాబు ఆ ఘనతను తన ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అంబటి విమర్శించారు. "1989 నుంచి కుప్పం ఎమ్మెల్యేగా ఉన్న చంద్రబాబుకు ఎప్పుడూ అక్కడికి నీళ్లు ఇవ్వాలనే ఆలోచన రాలేదు. 2024 ఫిబ్రవరిలో జగన్ నీళ్లు ఇస్తే, ఇప్పుడు లైనింగ్ పనుల పేరుతో సీఎం రమేష్ కంపెనీకి డబ్బులు కట్టబెడుతున్నారు" అని ఆయన ఆరోపించారు. ఒకరు చేసిన పనికి మరొకరు పేరు తెచ్చుకోవడంలో చంద్రబాబు ఆరితేరారని ఎద్దేవా చేశారు.

మంత్రి రామానాయుడిపైనా అంబటి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆయన 'రామా నాయుడా లేక డ్రామా నాయుడా?' అని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టుపై వాస్తవాలు మాట్లాడేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఇది సవాలు కాదని, చర్చకు రావాలని చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నట్లు అంబటి రాంబాబు పేర్కొన్నారు.

# వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పురస్కారం అందుకున్న బాలయ్య...

## హాజరైన బండి సంజయ్, నారా లోకేశ్

- మొదటి పేజీ తరువాయి

మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారి చేతుల మీదుగా బాలకృష్ణ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ బాలకృష్ణపై ప్రశంసల వర్షం కురిపించారు. "ఒక చరిత్ర రాయాలన్నా, దాన్ని తిరిగి రాయాలన్నా అది ఒక్క బాలయ్య బాబుతోనే సాధ్యం. ఆయన అందరికీ బాలయ్య అయితే, నాకు మాత్రం ముద్దుల మావయ్య" అని అన్నారు. 50 ఏళ్లుగా సినిమా, రాజకీయ రంగాలలో ఆయన తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని లోకేశ్ కొనియాడారు.

బాలకృష్ణ ఎప్పుడూ యంగ్ అండ్ ఎనర్జిటిక్‌గా ఉంటారని, ఆయన సినీ ప్రస్థానంలో చారిత్రక, జానపద, ఆధ్యాత్మికం, సైన్స్ ఫిక్షన్ వంటి ఎన్నో విభిన్న జానర్లలో నటించి మెప్పించారని గుర్తుచేశారు. "బాలయ్య బాబుది భోళాశంకరుడి మనస్తత్వం, అందుకే సినీ పరిశ్రమ ఆయన్ను అంతగా ప్రేమిస్తుంది. బసవతారకం ఆసుపత్రి ఆయనలోని మానవత్వానికి నిదర్శనం. ఓటీటీలో కూడా 'అన్‌స్టాపబుల్' అంటూ అద్భుతంగా రాణించారు. ఆయనకు ఈ పురస్కారం రావడం తెలుగు జాతికి గర్వకారణం" అని లోకేశ్ పేర్కొన్నారు.

# రాయలసీమకు నీళ్లు వస్తే వైసీపీ వాళ్లు జీర్ణించుకోలేకపోతున్నారు

### వైసీపీ హయాంలో నీటితో డ్రామాలు

దివంగత ఎన్టీఆర్ సంకల్పించిన రాయలసీమ సస్యశ్యామల స్వప్నాన్ని తాము నిజం చేస్తున్నామని చంద్రబాబు అన్నారు. "సీమలో పశువుల దాహం తీర్చడానికి రైళ్లలో నీళ్లు తెప్పించిన దుస్థితిని నేను చూశాను. అందుకే 1999లోనే హంద్రీ–నీవాకు శ్రీకారం చుట్టాను. 2014–19 మధ్య మా ప్రభుత్వ హయాంలో సీమ సాగునీటి ప్రాజెక్టులపై రూ. 12,441 కోట్లు ఖర్చు చేస్తే, గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కేవలం రూ. 2 వేల కోట్లు మాత్రమే వెచ్చించి చేతులు దులుపుకుంది. ఎన్నికల ముందు గేట్లకు రంగులేసి, బయటి నుంచి నీళ్లు తెచ్చి వదిలి డ్రామాల ఆడారు. వారు విమానం ఎక్కేలోపే ఆ నీళ్లు ఇంకిపోయాయి. అబద్ధాలు చెప్పడంలో వైసీపీ, అసాధ్యాలను సుసాధ్యం చేయడంలో ఎన్డీఏ దిట్ట" అని ఎద్దేవా చేశారు.

### సీమలో కరవును తరిమికొడతాం

నీటి విలువ తెలిసిన పార్టీ తెలుగుదేశం అని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రూ. 3,850 కోట్లు మంజూరు చేసి, కాలువల విస్తరణ పనులు పూర్తి చేసిందని చంద్రబాబు వివరించారు. "నాలుగు నెలల్లోనే 40 టీఎంసీల నీటిని తీసుకొచ్చి, పది రిజర్వాయర్లను నింపాం. దీనివల్ల సీమలోని 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందుతుంది. వచ్చే ఏడాదికల్లా చిత్తూరు జిల్లాలోని పీలేరు, పుంగనూరు, చంద్రగిరి వంటి చివరి నియోజకవర్గాలకూ నీరందిస్తాం. పోలవరం–బనకచర్ల ప్రాజెక్టు ద్వారా వంశధార–పెన్నా నదులను అనుసంధానిస్తే రాయలసీమలోనే కాదు, రెండు తెలుగు రాష్ట్రాల్లో కరవు అనే మాటే వినిపించదు. ఈ విషయాన్ని తెలంగాణ నేతలు కూడా అర్థం చేసుకోవాలి" అని ఆయన పిలుపునిచ్చారు.

'రప్పా రప్పా' రాజకీయాలు కుదరవని, మొన్నటి ఎన్నికల్లో పులివెందుల ప్రజలే దానికి సమాధానం చెప్పారని చురకలంటించారు. 'స్త్రీ శక్తి' పథకం వల్ల ఇబ్బందులు పడుతున్న ఆటో డ్రైవర్లను అన్ని విధాలా ఆదుకుంటామని, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వారికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. కుప్పంలో హిందాల్కో వంటి 12 పరిశ్రమల రాకతో వేలమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ప్రపంచంలోని అత్యుత్తమ టెక్నాలజీని కుప్పానికి తీసుకొస్తానని హామీ ఇచ్చారు. మెగా డీఎస్సీ, పెన్షన్ల పెంపు, అన్న క్యాంటీన్లు, దీపం పథకం వంటి హామీలను నెరవేరుస్తూ ప్రజారంజక పాలన అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, చిత్తూరు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# తాడిపత్రికి వెళ్లనున్న పెద్దారెడ్డి: జేసీ ప్రభాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

- మొదటి పేజీ తరువాయి

అడ్డుకోవడం లేదని, ఆయన వల్ల నష్టపోయిన బాధితులే వ్యతిరేకిస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పెద్దారెడ్డి అధికారాన్ని అడ్డంపెట్టుకుని అనేక దౌర్జన్యాలకు, అక్రమాలకు పాల్పడ్డారని జేసీ ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. "మహిళలని కూడా చూడకుండా టీడీపీకి చెందిన మహిళా కౌన్సిలర్లను వెంటాడి మరీ కొట్టిన చరిత్ర పెద్దారెడ్డిది. పోలీసుల అండతో ఎంతోమంది టీడీపీ కార్యకర్తలపై పీడీ యాక్టు కింద అక్రమ కేసులు బనాయించి, జిల్లా నుంచి బహిష్కరించారు" అని ఆయన విమర్శించారు. గతంలో టీడీపీ నేత పొట్టి రవికి రాష్ట్రపతి నుంచి అనుమతి ఉన్నప్పటికీ తాడిపత్రిలోకి అడుగుపెట్టనివ్వలేదని జేసీ గుర్తుచేశారు. తాడిపత్రిలో రాజకీయాలు చేసే నైతిక అర్హత పెద్దారెడ్డి కుటుంబానికి లేదని ఆయన అన్నారు. మరోవైపు, తాడిపత్రిలోకి ప్రవేశించకుండా తనపై ఉన్న ఆంక్షలను సవాలు చేస్తూ కేతిరెడ్డి పెద్దారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం, ఆయన తాడిపత్రి వెళ్లేందుకు శుక్రవారం అనుమతి ఇచ్చింది. పెద్దారెడ్డిని ఎవరూ ఆపలేరని స్పష్టం చేసిన కోర్టు, అవసరమైతే ప్రైవేట్ భద్రతను ఏర్పాటు చేసుకోవచ్చని సూచించింది. ఆయనకు తగిన భద్రత కల్పించాలని స్థానిక పోలీసులను ఆదేశించింది. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం కేతిరెడ్డి పెద్దారెడ్డి మీడియాతో మాట్లాడుతూ, త్వరలోనే తాడిపత్రికి వెళతానని తెలిపారు. కోర్టు తీర్పు కాపీలను ఎస్పీకి అందజేసి, నిబంధనల మేరకు పోలీసులకు పూర్తిగా సహకరిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ పరిణామాలతో తాడిపత్రిలో రాజకీయ వాతావరణం ఉత్కంఠగా మారింది.

# నా హత్యకు కుట్ర.. ఆ వీడియో చూసి షాకయ్యా

- మొదటి పేజీ తరువాయి

తాను మొదట షాక్‌కు గురయ్యానని కోటంరెడ్డి తెలిపారు. ప్రశాంతంగా ఉండే నెల్లూరు జిల్లాలో కొందరు రౌడీషీటర్లు తన హత్య గురించి చర్చించుకోవడం విస్మయానికి గురిచేసిందన్నారు. "ఈ ఏడాది జులై 1న ఈ సంభాషణ జరిగినట్లు తెలిసింది. ఒకడు రూరల్ ఎమ్మెల్యేను లేపేస్తే డబ్బే డబ్బు అనడం, మరొకడు చంపేద్దాం అనడం ఆ వీడియోలో ఉంది" అని ఆయన వివరించారు. ఈ వీడియో గురించి జిల్లా ఎస్పీకి మూడు రోజుల ముందే సమాచారం ఉన్నప్పటికీ, తనకు కనీసం ముందు జాగ్రత్త చర్యలు తీసుకోమని కూడా సూచించలేదని కోటంరెడ్డి ఆరోపించారు. ఈ వ్యవహారంపై వైసీపీ మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందని ఆయన మండిపడ్డారు. రాజకీయాల కోసం సొంత కుటుంబ సభ్యులను చంపుకొనే చరిత్ర తమది కాదని, ఆస్తుల కోసం ఆత్మీయులను ద్వేషించే సంస్కృతి తమకు లేదని పరోక్షంగా విమర్శలు గుప్పించారు. "నేను విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పటి నుంచే రౌడీ మూకలను తరిమి కొట్టాను. 16 నెలల క్రితమే సీఎం జగన్‌ను ధిక్కరించాను. అప్పుడే నన్ను, నా కుటుంబాన్ని బెదిరించినా భయపడలేదు. ఇప్పుడు ఈ కుట్రలకు భయపడతానా?" అని ఆయన ప్రశ్నించారు. తన కోసం నడిచే ప్రజల కోసం కొండలనైనా ఢీకొంటానని, ఎవరికీ భయపడబోనని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తేల్చిచెప్పారు.

# మిత్రులు, శత్రువులు శాశ్వతం కాదు.. దేశ ప్రయోజనాలే ముఖ్యం

- మొదటి పేజీ తరువాయి

విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. శనివారం జరిగిన ఎన్డీటీవీ డిఫెన్స్ సమ్మిట్ 2025లో రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించారు. రష్యా నుంచి ముడి చమురు దిగుమతులు ఆపాలంటూ, ట్రంప్ భారతీయ వస్తువులపై 50 శాతం సుంకాన్ని విధిస్తూ ఇటీవల హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ బెదిరింపులను ఉద్దేశించి రాజ్‌నాథ్ పరోక్షంగా స్పందించారు. "ప్రపంచం వేగంగా మారుతోంది. అభివృద్ధి చెందిన దేశాలు కూడా రక్షణాత్మక విధానాలను అనుసరిస్తున్నాయి. వాణిజ్య, సుంకాల యుద్ధం తీవ్రమవుతోంది" అని ఆయన అన్నారు.

ఈ పరిస్థితుల్లో భారత్ తన సొంత ప్రయోజనాలకు కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. "మా దేశ రైతులు, చిన్న వ్యాపారులు, పౌరుల ప్రయోజనాలే మాకు ప్రథమ ప్రాధాన్యం. వారి సంక్షేమం విషయంలో ఎలాంటి పరిస్థితుల్లోనూ రాజీపడబోం. మాపై ఎంత ఒత్తిడి పెంచినా మా విధానాలు మారవు" అని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఒత్తిళ్లు పెరిగేకొద్దీ భారత్ మరింత బలపడుతుందని, ఆత్మనిర్భరత లక్ష్యంతో ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు. తమ సిద్ధాంతాలు, నైతిక విలువల విషయంలో ప్రధాని మోదీ ఎన్నడూ రాజీపడరని ఆయన గుర్తుచేశారు. భారత్ ఎవరినీ శత్రువుగా చూడదని, కానీ దేశ ప్రయోజనాలకు ఎవరు అడ్డువచ్చినా ఉపేక్షించేది లేదని ఆయన పరోక్షంగా హెచ్చరించారు.

## గణనాథుడి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి





**కర్నూలు, పెన్ పవర్ ఆగస్టు 30 :** గణనాథుడి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శనివారం సమాచార శాఖ కార్యాలయం ప్రాంగణం లో ఏర్పాటు చేసిన పాత్రికేయ గణపతిని జిల్లా కలెక్టర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గణనాథుని ఆశీర్వాదంతో ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా, సుఖశాంతులతో ఉండాలని కోరారు... అదే విధంగా జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా ముందుకు సాగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం పాత్రికేయ ఉత్సవ గణపతి సమితి సభ్యులు కలెక్టర్ గారికి సన్మానం చేశారు. జిల్లా కలెక్టర్ గారితో పాటు సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు కె.జయమ్మ, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు...

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

# పరమసముద్రం చెరువు వద్ద కృష్ణమ్మకు సీఎం జలహారతి





**కుప్పం, పెన్ పవర్ ఆగస్టు 29 :** "రాయలసీమ అభివృద్ధికి బ్లూ ప్రింట్ సిద్ధం చేసుకున్నాం... అన్ని రంగాల్లోనూ సీమను అభివృద్ధి చేసేలా మా దగ్గర ప్రణాళికలున్నాయి. దీంట్లో భాగంగానే రాయలసీమకు హంద్రీ-నీవా కాల్వల విస్తరణ ద్వారా కుప్పం చిట్ట చివరి భూములకు నీటిని అందించాం. రాయలసీమకు నీళ్లు వస్తే వైసీపీకి జీర్ణం కాదు. వైసీపీకి నాటకాలు ఆడడం అలవాటు... ఎన్డీఏకు నీళ్లు తేవడం అలవాటు." అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శనివారం కుప్పం బ్రాంచ్ కెనాల్ వద్ద కృష్ణమ్మకు సీఎం చంద్రబాబు జలహారతి ఇచ్చారు. హంద్రీ-నీవా కాల్వల విస్తరణ ద్వారా కృష్ణా జాలాలు కుప్పం చివరి భూములకు చేరాయి. శ్రీశైలం నుంచి 738 కిలో మీటర్లు ప్రయాణించి కృష్ణమ్మ కుప్పానికి చేరుకుంది. దీంతో కుప్పం ప్రజల చిరకాల కోరిక నెరవేరింది. ఈ సందర్భంగా కుప్పంలో పర్యటించిన చంద్రబాబు తన నివాసం నుంచి కుప్పం బ్రాంచ్ కెనాల్ వద్దకు ఆర్టీసీ బస్సులో మహిళలు, రైతులతో కలిసి చేరుకుని జలహారతి ఇచ్చారు. సంప్రదాయ పద్దతిలో పంచెకట్టుకుని కృష్ణమ్మకు జలహారతి అందించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య కృష్ణమ్మకు పసుపు, కుంకమ సమర్పించి జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా పరమసముద్రంచెరువు సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... 'నన్ను 8 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించి ఆదరించిన నా కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలు తీసుకురావడంతో నా జన్మ ధన్యమైంది. నా సంకల్పం నెరవేరింది. నా ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. కృష్ణా పుష్కరాలు 2028లో వస్తుంటే కుప్పానికి మాత్రం రెండేళ్లు ముందే వచ్చాయి. కుప్పం ప్రజలు నన్ను ఇంటి బిడ్డగా ఆదరించారు. వారికి నేను ఏం చేసినా తక్కువే' అని చంద్రబాబు అన్నారు.

**ఎన్టీఆర్ సంకల్పాన్ని నెరవేర్చాం :** "ఆనాడు ధవళేశ్వరం, ప్రకాశం బ్యారేజ్ నిర్మాణంతో కాటన్ దొర... కృష్ణా, గోదావరి జిల్లాల పరిస్థితి మార్చేశాడు. అందుకే కాటన్ దొరను అక్కడి ప్రజలు ఆరాధిస్తారు. అలాగే ఎన్టీఆర్ కృష్ణా మిగులు జలాలు సీమకు తేవాలని సంకల్పం చేశారు. సీమను సస్యశ్యామలం చేయాలని కలలు కన్నారు. సీమలో పశువులను బతికించుకోవడానికి రైళ్లలో నీళ్లను తెప్పించిన పరిస్థితి నాడు ఉండేది. వేరుశనగ పంట వేస్తే కనీసం విత్తనాల ఖర్చు కూడా వచ్చేది కాదు. సీమలో ఇలాంటి పరిస్థితిని మార్చాలనే సంకల్పంతో 1999లో హంద్రీనీవాను నేనే ప్రారంభించాను.' 2025 నాటికి పరమసముద్రానికి కృష్ణా జలాలు తెచ్చామని సీఎం చంద్రబాబు అన్నారు. 'శ్రీశైలం మల్లన్న పాదాల చెంత నుంచి కుప్పం మల్లన్న వద్దకు కృష్ణా జలాలను తెచ్చాం. గంగమ్మ కరుణించింది... కృష్ణమ్మ తరలి వచ్చింది. 2014-19 మధ్య సీమలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై రూ.12,441 కోట్లు ఖర్చు పెట్టాం. వైసీపీ కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే ఖర్చు పెట్టింది. ఎన్నికల ముందు గేట్లతో సెట్టింగులు వేసి డ్రామాలాడారు. నీళ్లు కూడా బయట నుంచి తెచ్చి వదిలారు. వారు విమానం ఎక్కేలోగానే ఆ నీరు ఇంకిపోయింది. అబద్ధాలు చెప్పడంలో వైసీపీ దిట్ట. అసాధ్యాలు సుసాధ్యం చేయడంలో ఎన్డీఏ దిట్ట. నేను వెళ్లేలోగా నీరు ఇంకిపోతుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రతి చెరువుకు నీరిచ్చే బాధ్యత నాది." అని సీఎం హామీ ఇచ్చారు.

**టీడీపీకి నీటి విలువ తెలుసు :** "నీటి విలువ తెలిసిన పార్టీ తెలుగుదేశం. వైసీపీ లాంటి పార్టీలకు నీటి విలువ, రైతు సమస్యలు ఎప్పటికీ తెలియవు. 100 రోజుల కార్యాచరణ లక్ష్యంతో రూ.3,850 కోట్లు మంజూరు చేశాం. కాల్వలు వెడల్పు చేశాం. నాలుగు నెలల్లో 40 టీఎంసీల నీరు తెచ్చాం. పది రిజర్వాయర్లను నింపాం. చెరువులను నింపుతున్నాం. సీమ జిల్లాల్లో 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందుతుంది. పరిశ్రమలకు కూడా నీరు లభిస్తుంది. వచ్చే ఏడాదికి చిత్తూరు చివరి భూములకు కూడా నీరందిస్తాం. పీలేరు, పుంగనూరు, చంద్రగిరి, పూతలపట్టు, చిత్తూరు, జీడీ నెల్లూరు నియోజకవర్గాల ప్రజలకు దీంతో ప్రయోజనం కలుగుతుంది. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ద్వారా వంశధార-పెన్నా నదుల అనుసంధానం చేయవచ్చు. ఇదే జరిగితే రాయలసీమకే కాదు.. రెండు తెలుగు రాష్ట్రాలకు శాశ్వతంగా కరవు అనేదే ఉండదు. తెలంగాణ ప్రజలు, నేతలు కూడా నదుల అనుసంధానం వల్ల కలిగే ప్రయోజనాలను అర్థం చేసుకోవాలి. నా 45 ఏళ్ల రాజకీయ జీవితంలో నీటి నిర్వహణపైనే దృష్టి పెట్టాను. నీరు-మీరు, నీరు-చెట్టు, చెక్ డ్యాములు, సాగు నీటి సంఘాలు, వాటర్ షెడ్లు అంటూ నీటి నిర్వహణ కోసం ప్రయత్నించాను. పరుగెత్తే నీటిని నడిపించాలి... నడిచే నీటిని నిలపాలనే సూత్రంతో పనిచేశాను. కుప్పం సహా సీమలోని ప్రతి చెరువునూ నింపుతాం. చెరువులను నింపితే... వర్షాభావ పరిస్థితులు వచ్చినా తట్టుకోగలం" అని సీఎం అన్నారు.

**రాక్షసుల్లా అడ్డు పడుతున్నారు :** "రాష్ట్రాభివృద్ధికి యజ్ఞం చేస్తుంటే... కొందరు రాక్షసుల్లా అడుగడుగునా అడ్డుపడుతున్నారు. తప్పుడు ప్రచారాలతో ప్రతి మంచి పనికీ అడ్డంకులు సృష్టిస్తున్నారు. చేతనైతే అభివృద్ధి, సంక్షేమంలో పోటీ పడాలి. మొన్నటి ఎన్నికల్లో సీమ ప్రజలు 52 సీట్లకు గాను వాళ్లకు 7 ఎమ్మెల్యే సీట్లు ఇచ్చినా వారికి బుద్ధి రాలేదు. ప్రతిపక్షం అని చెప్పుకుంటున్న వైసీపీ విషవృక్షంలా తయారైంది. తన ఉనికి చాటుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. అయితే వారి కుట్రలకు కాలం చెల్లింది. ప్రజలు చైతన్యంతో కుట్రలు బద్దలు కొడుతున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి కుప్పంలో తెలుగుదేశాన్నే గెలిపిస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న కుప్పంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలని ప్రయత్నించారు. రప్పా రప్పా రాజకీయం చేస్తామని బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికల్లో రప్పా రప్పా రాజకీయం ఎలా ఉంటుందో... ప్రజలే వారికి చూపించారు. ఎన్ని అడ్డంకులు కల్పించినా... ఇబ్బందులు సృష్టించినా.. అభివృద్ధి చేస్తున్నాం.. సంక్షేమమూ చేపడుతున్నాం." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ఆటో డ్రైవర్లకూ అండగా ఉంటాం :** "ఉచిత బస్సు ప్రయాణంతో ఆడబిడ్డలంతా సంతోషంగా ఉన్నారు. స్త్రీ శక్తితో ఆటో డ్రైవర్లు ఇబ్బంది పడకుండా చూస్తాం. వారిని కూడా ఆదుకుంటాం. ఆటో డ్రైవర్లకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేస్తాం. మెగా డీఎస్సీ ద్వారా టీచర్ల రిక్రూట్మెంట్ చేపడుతున్నాం. కుప్పం నుంచి కూడా 50 మంది టీచర్లు ఎంపికయ్యారు. కుప్పం నియోజకవర్గానికి ఒకప్పుడు టీచర్లే వచ్చే వారు కారు.. ట్రాన్స్‌ఫర్లు చేయించుకుని వెళ్లిపోయేవారు. కానీ ఇప్పుడు కుప్పం యువతీ, యువకులే టీచర్లయ్యారు. తల్లికి వందనం అందరికీ ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులను ఆదుకుంటున్నాం. అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశాం. పెన్షన్లు ఇస్తున్నాం. దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. ఇలా ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ పాలన చేస్తున్నాం. కుప్పానికి 12 పరిశ్రమలు వచ్చాయి. రూ.3908 కోట్లు పెట్టుబడులు, 15600 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు, 26581 మందికి పరోక్ష ఉపాధి

తరువాయి 4లో..

## కోట్లమంది జీవితాలను మార్చిన.. మారుస్తున్న ముఖ్యమంత్రి

### కుప్పం ప్రజల కల సాకారమైన వేళ.. ఎన్టీఆర్ సంకల్పంను సాకారం చేసిన ముఖ్యమంత్రి : ఎంఎల్సీ కంచర్ల శ్రీకాంత్

**కుప్పం, పెన్ పవర్ ఆగస్టు 29 :** ఎంఎల్‌సి మాట్లాడుతూ కోట్లమంది జీవితాలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా మార్చుతున్నారన్నారు. కుప్పం నియోజకవర్గ ప్రజల ఎన్నో ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ కృష్ణా జలాలను హంద్రీ నీవా ద్వారా కుప్పం కు తీసుకురావడం జరిగిందన్నారు. నాడు స్వర్గీయ ఎన్టీఆర్ సంకల్పం చేస్తే హంద్రీ నీవా ద్వారా జలాలను తెచ్చేందుకు సంకల్పం చేస్తే దాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి సాకారం చేశారన్నారు. 2014-19 లో 87 శాతం పనులు పూర్తికాగా తరువాత వచ్చిన వై సి పి ప్రభుత్వం కోర్టు లో కేసులు వేసి పనులు ఆపారన్నారు. ప్రజా సంక్షేమం కోరని వారు పనులను ఆపితే భగీరథ ప్రయత్నానికి మించి శ్రీశైలం నుండి 1200 అడుగుల ఎత్తులో ఉన్న కృష్ణా జలాలను కుప్పానికి తెప్పించి కుప్పం దాహార్తిని సాగునీటిని అందించిన అభినవ భగీరథునిగా నిలిచారన్నారు. కృష్ణా జలాలు పారామసముద్రానికి తెచ్చిన రోజుని సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ రోజుగా అభివర్ణించారు. ఈ మహోన్నత కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్ళవలసిన అవసరం ఉందన్నారు. రానున్న రోజుల్లో ప్రతి చెరువుకు నీరు అందించేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించాలన్నారు. ప్రతి పొలానికి ఈ నీరు చేరుతుందని, కలసికట్టుగా అందరం పని చేసి కుప్పం ప్రాంతాన్ని అగ్రగామిగా నిలపాలన్నారు.




**ముఖ్యమంత్రి చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను భవిష్యత్ తరాలు గుర్తించుకుంటాయి : ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద్ రావు**

చిత్తూరు ఎం.పి మాట్లాడుతూ. . శ్రీశైలం నుండి 735 కి.మీ ల ప్రయాణం చేసి చివరి మైలు కుప్పం లోని పరమసముద్రం కు కృష్ణా జలాలు చేరిందన్నారు. తద్వారా వ్యవసాయం చాలా బాగా పెరగడమే కాకుండా భూగర్భ జలాలు కూడా పెరుగుతుందన్నారు. కుప్పం నియోజకవర్గం లోని 530 చెరువులకు నీరు చేరాలన్నారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళు గా రాష్ట్ర ముఖ్యమంత్రి పని చేస్తూ కేంద్రప్రభుత్వం నుండి ఎన్నో నిధులను రాష్ట్రానికి ముఖ్యమంత్రి తీసుకొస్తున్నారన్నారు. భవిష్యత్ తరాల వారు సి ఎం లాంటి వ్యక్తి చేసిన అభివృద్ధి గురించి మాట్లాడుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కార్యదర్శి పి.ఎస్.ప్రద్యుమ్న, జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి. సాయి ప్రసాద్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జే సి విద్యాధరి, కడా పిడి వికాస్ మర్మత్, పలమనేరు ఎంఎల్ఏ ఎన్.అమరనాథ్ రెడ్డి, ఏ పి ఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం నాయుడు, జిల్లా అధికారులు, కుప్పం ఆర్డీవో శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం సభా వేదిక సమీపం లో కుప్పం ప్రాంత అభివృద్ధి సంస్థ మరియు ఆంధ్ర ప్రదేశ్ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుప్పం ప్రకృతి దర్శిని వాహనాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించి కుప్పం ప్రకృతిదర్శిని బ్రౌచర్ ను ఆవిష్కరించారు. కుప్పం పురపాలక సంఘం ఏర్పాటు చేసిన రథం ను పరిశీలించారు. బసవతారకం ఇండో - అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి మరియు పరిశోధనా సంస్థ, కుప్పం ప్రాంత అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాన్సర్ వ్యాధి అవగాహన మరియు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరానికి సంబంధించిన కార్యక్రమంలో భాగంగా సంచార స్క్రీనింగ్ వాహనాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించారు.



## భూ సేకరణ పనులపై దృష్టిని సారించాలి : జిల్లా కలెక్టర్ డా.వినోద్ కుమార్.వి

అనంతపురం, పెన్ పవర్ ఆగస్టు 30 : ఏజెంట్ స్పేస్ నందు డాక్యుమెంట్ అప్లోడ్, పిఎం కుసుమ్ యోజన పథకంలో భాగంగా పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ పనులపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. వినోద్ కుమార్, వి.ఐ ఎ ఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి డీఆర్ఓ మాలోల, నియోజక వర్గ అధికారులు, ఆర్డీఓ లు, తహశీల్దార్లు, ఎంపిడిఓ లు పలువురు జిల్లా అధికారులు,ఏపీ ఎస్పీడీసీఎల్ తదితరులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పీఎం కుసుమ్, ఏజెంట్ స్పేస్ తదితర అంశాల పురోగతిపై సమీక్షించి పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పిఎం కుసుమ్ యువజన పథకం ఆవశ్యకత గురించి వివరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ పథకం ద్వారా రైతులు తమ పంటలను సాగు చేయడానికి సౌర శక్తిని ఉపయోగించుకునే విధంగా మరియు వ్యవసాయ పద్ధతుల్లో అనేక మార్పులు ప్రయోజనాలు పొందేందుకు ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ముఖ్యంగా ఐదు



కిలోమీటర్ల దగ్గరగా ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సబ్ స్టేషన్ ఉన్నచోట భూసేకరణ పనులు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు నాణ్యతగా లోపాలు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఏజెంట్ స్పేస్ ఇటిపిఎస్ పోర్టల్ నందు సంబంధిత శాఖలకు చెందిన పలు డాక్యుమెంట్లు అప్లోడ్ పనులను జాగ్రత్తగా త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 65 శాఖలకు లాగ్ ఇన్ ఐడి లు ఇవ్వడం జరిగిందని అందులో డేటా అప్లోడ్ చేసే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.మరి ముఖ్యంగా అన్ని శాఖ అధికారులు ముఖ్యమైన ప్రత్యుత్తరాల లేఖలు, కోర్టు కేసులు, ప్రభుత్వ జీవోలు, ప్రొసీడింగులు, సర్కులర్ లు, టెండర్లు, ఉద్యోగ ప్రకటనలు, పిజిఆర్ఎస్ ఫిర్యాదులు మరియు పరిష్కార లేఖలు, ఎండార్స్మెంట్స్ తదితర వాటిని ప్రతిరోజు 100కు పైగా అప్లోడ్ చేయాలని, అన్ని శాఖలకు సంబంధించి ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకుని త్వరిత గతిన అన్ని డాక్యుమెంట్లు అప్లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## బీసీ జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో స్త్రీశక్తి పథకం విజయోత్సవ ర్యాలీ





**బనగానపల్లి పెన్ పవర్ ఆగస్టు 30 :** బనగానపల్లె నియోజకవర్గం కొలిమిగుండ్ల మండలంలో రామకో సిమెంట్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన స్త్రీశక్తి పథకం విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి. ఈ సందర్భంగా కొలిమిగుండ్ల బస్టాండ్ సెంటర్ నుంచి ఇటిక్యాల గ్రామంలో రామ్ కో సిమెంట్ కమ్యూనిటీ హాల్ వరకు స్థానిక మహిళలతో కలిసి ర్యాలీలో పాల్గొన్న మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి. కొలిమిగుండ్ల మండలంలోని ఇటిక్యాల గ్రామంలో రామ్ కో సిమెంట్ ఆధ్వర్యంలో సీఎస్ ఆర్ నిధులు రూ. 2.75 కోట్లతో నిర్మించిన నూతన కమ్యూనిటీ హాలును సైతం నేడు లాంఛనంగా ప్రారంభించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి. ఈరోజే నూతనంగా ప్రారంభించిన రామ్ కో సిమెంట్ వారి నూతన ఫంక్షన్ హాలులో తొలి కార్యక్రమంగా ఆడపడుచులతో కలిసి స్త్రీశక్తి పథకం విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొనడంపై హర్షం వ్యక్తం చేసిన మంత్రి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ అమలులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో... ఆగష్టు 15 నుంచి ఆడపడుచులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తోన్న కూటమి ప్రభుత్వం.. నేడు స్త్రీశక్తి పథకం అమలుతో క్షేత్రస్థాయిలో మహిళల నుంచి సానుకూల స్పందన, ఆడపడుచులు ఈ పథకాన్ని సద్వినియోగపర్చుకుంటున్న క్రమంలో నిర్వహించిన విజయోత్సవ సభలో సంతోషం వ్యక్తం చేసిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి. స్త్రీ శక్తి పథకాన్ని సమర్ధవంతంగా వినియోగించుకుంటున్నమని.. నేడు మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్ర, విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొని సంతోషం వ్యక్తం చేసిన గృహిణులు, మహిళా ఉద్యోగస్తులు, విద్యార్థినులు. ఈ సందర్భంగా కొలిమిగుండ్ల మండలం పొదుపు సంఘాల మహిళలకు చెక్కును అందజేసిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆడపడుచులకు తన సొంత నిధులతో భోజన వసతి ఏర్పాటు చేసిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ నాడు ప్రతిపక్షంలో సూపర్ 6 గురించి చెబితే, వైసీపీ నేతలు అవహేళన చేశారు. సూపర్ సిక్స్ పై ఓట్లకోసమేనంటూ వైసీపీ నాడు దుష్ప్రచారం చేసింది. వైసీపీ దుష్ప్రచారం చేసినా, ప్రజలు చంద్రబాబుతో గారితో సూపర్ 6 సాధ్యమని నమ్మి గెలిపించారు. వైసీపీ నాడు హామీలను అమలు చేయకపోవడంతో, దాదాపు 75 శాతం మహిళలు గత ఎన్నికల్లో టీడీపీకే పట్టం కట్టారు. నేడు ఫించన్ లు రూ. 3 నుంచి 4 వేలకు పెంచాం.. గతంలో 2 నుంచి 3 వేలు చేయడానికి 5 ఏళ్లు వైసిపికి పట్టింది. నాడు ఆడబిడ్డలకు కట్టెల పొయ్యి కష్టాల నుంచి విముక్తి కల్పించాలనే దీపం పథకం చంద్రబాబు ప్రారంభించారు. నేడు దీపం 2 పథకం కింద ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నాం. నాడు వైసీపీ నేతలు సాధ్యం కాదంటే, నేడు తల్లికి వందనం కుటుంబంలో ఎంతమంది ఉంటే అందరికీ... ఇచ్చి చేతల్లో చేసి చూపించాం. వైసీపీ నేతల కుటుంబాల్లో కూడా ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ పథకం విజయవంతంగా రైతులందరి ఖాతాల్లో సొమ్ములు జమ చేశాం. నాడు ఉచిత బస్సు అంటే మహిళలు కూడా కొంత అనుమానంగా చూసేవారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆడపడుచుల పక్షపాతి.. దేశంలో తెలుగింటి ఆడపడుచులు ముందుండాలనేదే ఆయన లక్ష్యం. నేడు పొదుపు సంఘాలు, డ్వాక్రా సంఘాల మహిళలు ఎంతో అభ్యున్నతి సాధించారు.. దీనికి తొలుత చంద్రబాబు విత్తనం వేస్తే.. నేడు మహావృక్షంగా మారారు. ఏ సంక్షేమ కార్యక్రమం చూసుకున్నా, మహిళలకే అందులో పెద్దపీట వేయడం తెలుగుదేశం పార్టీ ఆనవాయితీ నేడు వైసీపీ నేతలు కుటిల రాజకీయాలకు పాల్పడుతున్నారు. వైసీపీ నేతలకు ఆడపడుచుల సాక్షిగా సవాల్ విసురుతున్నా.. వైనాట్ 175 అంటే.. మిమ్మల్ని 11 సీట్లకు పరిమితం చేసి.. మీరు రాజకీయాలకు అసమర్ధులని మహిళలంతా విసిరికొట్టారు. ప్రతిపక్ష హోదా కూడా దక్కలేనంతగా, ప్రజల ఎవగించుకునేలా, దారుణంగా మీ అసమర్థపాలన నాడు సాగింది. అభివృద్ధి, సూపర్ సిక్స్ అమలు నేడు వైసీపీ నేతల కళ్లకు కనపడటం లేదా ? నేడు అభివృద్ధి-సంక్షేమ పాలనను సమపాళ్లలో ప్రజలకు అందిస్తున్నామన్నారు.

## 15 శాతం వృద్ధి సాధించడంపై దృష్టి పెట్టాలి – సీపీఓ అశోక్ కుమార్





**అనంతపురం, పెన్ పవర్ ఆగస్టు 30 :** జిల్లాలో 15 శాతం వృద్ధి సాధించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీపీఓ అశోక్ కుమార్ ఆదేశించారు. శనివారం నగరంలోని జిల్లా ప్రణాళిక శాఖ కార్యాలయంలో స్వర్ణ ఆంధ్ర కీ పర్ఫామెన్స్ ఇండికేటర్స్ మానిటరింగ్, జీరో పావర్టీ పీ4, జీవిఏ&తలసరి ఆదాయం, తదితర అంశాలపై నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్స్, యంగ్ ప్రొఫెషనల్స్ తో సీపీఓ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఓ మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించిన విధంగా జిల్లాలో 15 శాతం వృద్ధి సాధించడంపై దృష్టి పెట్టాలని, మండల స్థాయిలో 25 ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని కీ పర్ఫామెన్స్ ఇండికేటర్స్ డేటా అప్లోడ్ పారదర్శకంగా, జాగ్రత్తగా చేపట్టాలని సూచించారు. ఇందులోభాగంగా జీరో పావర్టీ పీ4, జీవిఏ&తలసరి ఆదాయం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్స్, యంగ్ ప్రొఫెషనల్స్ పాల్గొన్నారు.

## చెన్నంపల్లి గ్రామ సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్




**బుక్కరాయసముద్రం, అనంతపురము, పెన్ పవర్ ఆగస్టు, 30 :** జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పి.ఎం. కుసుమ్ యోజన పథకం కింద పునరుత్పాదక ఇంధన ఆధారిత పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసే క్రమంలో భాగంగా బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ ఇ శేషాద్రి, మండల తాసిల్దార్ శ్రీధర్ మూర్తి, ఎంపీడీవో సాల్మన్ మెగా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ప్రతినిధులు, డి ఈ ఈ రఘు, ఏ ఈ ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వే నెంబర్ 103 కు సంబంధించిన 50 ఎకరాల వివరాలను రెవెన్యూ అధికారుల ద్వారా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పి.ఎం. కుసుమ్ యోజన పథకం ద్వారా వ్యవసాయ సౌర శక్తిని ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. సోలార్ పంపులు మరియు గ్రిడ్ కనెక్ట్ చేయబడిన పునరుత్పాదక ఇంధన ఆధారిత పవర్ ప్లాంట్లను ప్రస్తుతం సేకరించిన సదరు భూమి వద్ద ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మెగా ఇంజనీరింగ్ లిమిటెడ్ కంపెనీ వారి ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో సోలార్ ప్లాంట్ 12 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి ప్రైవేట్ భూమిని రైతుల ద్వారా కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భూమి విక్రయించిన సంబంధిత రైతులతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులతో ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై పలు ఆదేశాలు సూచనలు జారీ చేశారు. అలాగే చెన్నంపల్లి గ్రామ సచివాలయం ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ పనితీరు గురించి ఆరా తీశారు. పలు రికార్డులను పరిశీలించారు.

## తిరుప్పావై ఉపన్యాసాల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

**తిరుమల పెన్ పవర్ ఆగస్టు 30 :** పవిత్రమైన ధనుర్మాసంలో 2025 డిసెంబరు 16 నుంచి 2026 జనవరి 14వ తేదీ వరకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో తిరుప్పావై ఉపన్యాసాలు చేసేందుకు సమర్థులైన శ్రీవైష్ణవ సిద్ధాంతం తెలిసిన పండితుల నుంచి దరఖాస్తులు, అంగీకార పత్రాలను టిటిడి ఆహ్వానిస్తోంది. టిటిడి ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రతి ఏటా ధనుర్మాసంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో తిరుప్పావై ఉపన్యాసాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అర్హులైనవారు ఈ ఏడాది సెప్టెంబరు 1 నుండి 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు "ప్రత్యేకాధికారి, ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు, శ్వేత భవనం, టిటిడి, తిరుపతి" అనే చిరునామాకు దరఖాస్తులు, అంగీకార పత్రాలు పంపాల్సి ఉంటుంది. అంగీకార పత్రాలు ఇచ్చే పండితుల పట్టికతోపాటు, షరతులు, దరఖాస్తులను వెబ్‌సైట్ నుంచి పొందొచ్చు. ఇతర వివరాలకు టిటిడి ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు కార్యాలయాన్ని సెల్ : 9676120226, 8978734947 నంబర్ల ద్వారా సంప్రదించగలరు.

## మహిళా సాధికారితే సీఎం చంద్రబాబు లక్ష్యం




**ఒంగోలు, పెన్ పవర్ ఆగస్టు 30 :** మహిళా సాధికారితే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అడుగులు వేస్తున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే మహిళలకు అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో స్త్రీ శక్తి విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడంలో ముందుండే వ్యక్తి సీఎం చంద్రబాబు అన్నారు. 2004లోనే సీఎం చంద్రబాబు చదువుకునే ఆడబిడ్డల కోసం ఉచితంగా సైకిల్స్ అందించారని ఎమ్మెల్యే ఏలూరి గుర్తు చేశారు. మా అమ్మ పట్టుదలతో నన్ను చదివించారని ఆమె ప్రోత్సాహంతోనే నేను ఈ స్థాయిలో ఉన్నానని పేర్కొన్నారు. మహిళలకు అవకాశాలు ఇస్తే అద్భుతాలు చేస్తారని నమ్మిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. ప్రతి నెల రాజకీయాలకు అతీతంగా కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులను పొగాకు కంపెనీలు మోసం చేశాయని, ప్రభుత్వాన్ని ఒపించి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వమే పొగాకు కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఐటిసి కంపెనీ మాత్రం రైతులకు హామీ ఇచ్చిన ప్రకారం చెప్పిన రేటుకు కొనుగోలు చేస్తున్నారని రైతాంగ పక్షాన ఐటీసీ కంపెనీ ధన్యవాదాలు తెలిపారు. ఆడబిడ్డలను, అక్కా చెల్లెమ్మలను సామాజికంగా, ఆర్థికంగా పైకి తీసుకొచ్చి వారి కాళ్లపై వాళ్ళ సొంతంగా వ్యాపారాలు చేసుకొని ఎదగాలన్నదే తెలుగుదేశం పార్టీ విధానం అన్నారు. మహిళ సాధికారత, మహిళా స్వావలంబనను దృష్టిలో ఉంచుకొనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేశారన్నారు. మంత్రి నారా లోకేష్ ప్రతిపాదించిన నా తెలుగు కుటుంబంలో భాగమైన స్త్రీ శక్తి విధానాన్నే సూపర్ సిక్స్ పథకం ద్వారా కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మహిళలు, యువత, ట్రాన్స్ జెండర్లకు ఆర్టీసీ బస్సుల్లో ఆగస్టు 15 నుంచి ఉచిత ప్రయాణాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారని గుర్తు చేశారు.

## కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు సబ్ జైలులు విజిట్






**కడప పెన్ పవర్ ఆగస్టు 30 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, గౌరవ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప గౌరవ డాక్టర్ సి.యామిని వారి సూచనల మేరకు గౌరవ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు కమలాపురం, జమ్మలమడుగు మరియు ప్రొద్దుటూరు సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ లను విజిట్ చేయడం జరిగినది. రిజిస్టర్లను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్ జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ల ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమును వివరించారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు, జైళ్లలో బాల నేరస్తులు ఉంటే గుర్తించడం వారికి తగు న్యాయ సహాయం అందించడం మొదలగు అంశాలను వివరించారు. అనంతరం జైలు పరిసరాలను, టాయిలెట్లను, వంట గదిని, వసతి గదులను, పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగినది. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఏవైనా సమస్యలుంటే కమలాపురం మండల న్యాయ సమితిని, జమ్మలమడుగు మండల న్యాయ సేవా సమితిని, ప్రొద్దుటూరు మండల న్యాయ సేవా సమితిని మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం, జమ్మలమడుగు మరియు ప్రొద్దుటూరు సబ్ జైలుల సూపర్డెంట్ లు, ఇంచార్జ్ సూపర్డెంట్ లు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు మరియు ఖైదీలు పాల్గొన్నారు.

## పరమసముద్రం చెరువు వద్ద కృష్ణమ్మకు సీఎం జలహారతి

**(3వ పేజీ తరువాయి)** లభిస్తుంది. ఐ-ఫోన్ ఛాసిస్ ఉత్పత్తి చేసేలా హిందాల్కో సంస్థ యూనిట్టును ప్రారంభించబోతోంది. కుప్పాన్ని ఇతర రాష్ట్రాలకు కనెక్ట్ చేస్తూ పెద్ద ఎత్తున రహదారుల నిర్మాణం జరుగుతోంది. ప్రపంచంలోని టెక్నాలజీనంతా కుప్పానికి తెస్తాను." అని చంద్రబాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల, చిత్తూరు జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**కుప్పంలో సీఎం పర్యటన సైడ్ లెట్స్ :** చంద్రబాబు జలహారతి ఇస్తున్న సమయంలోనే కుప్పంలోని మొత్తం 60కు పైగా ప్రాంతాల్లో జలహారతులు కుప్పం ప్రజలు ఇచ్చారు. కుప్పంలోని తన నివాసం నుంచి ఆర్టీసీ బస్సులో ముఖ్యమంత్రి ప్రయాణించారు. మహిళలు, రైతులతో కలిసి స్త్రీ శక్తి బస్సులో సీఎం వెళ్లారు. కుప్పం బ్రాంచ్ కెనాల్ వరకు మహిళలు, రైతులతో సంభాషిస్తూ బస్సులో సీఎం ప్రయాణించారు. స్త్రీ శక్తి పేరుతో అందిస్తున్న ఉచిత బస్సు సదుపాయం ఎలా ఉందని మహిళలను అడిగిన చంద్రబాబు.... తాము ఎక్కడికి వెళ్లినా ఇబ్బంది లేకుండా... ఫ్రీ బస్సులో వెళ్తున్నామని మహిళలు చెప్పారు. హంద్రీ-నీవా నీళ్లు తొలిసారి కుప్పానికి వచ్చాయి.. కాల్వల్లో నీళ్లు చూశారా..? చెరువులు నిండాయా అంటూ చంద్రబాబు ఆరా తీశారు. తొలిసారి కుప్పానికి కృష్ణమ్మ వచ్చిందని... చాలా సంతోషంగా ఉందని రైతులు, మహిళలు చెప్పారు. ఇక సభకు హాజరయ్యే ముందు బోటులో పరమ సముద్రం చెరువులోకి వెళ్లి చెరువును పరిశీలించారు. ఇక సభలో 2014-19 మధ్య అసెంబ్లీలో సాగునీటి రంగంపై జరిగిన చర్చ వీడియోను సీఎం చంద్రబాబు ప్రదర్శించారు. నాడు ప్రతి నియోజకవర్గానికి నీళ్లిస్తామని సభలో చంద్రబాబు ప్రకటించిన వీడియోను పొందుపరిచారు. జగన్ అడ్డంగా పడుకున్నా... నీళ్లిచ్చి తీరతామంటూ నాడు సభలో నాడు చంద్రబాబు స్పష్టం చేస్తూ ప్రకటన వీడియో చూసిన సభికులు చప్పట్లతో సభా ప్రాంగణాన్ని మార్మోగించారు. ఈ సందర్భంగా వైసీపీ తీరును సభలో సీఎం ఎండగట్టారు. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను తరలించి.. కృష్ణా జలాలను సీమకు తీసుకువచ్చే ప్రయత్నం చేశామని నాడు సభలో జరిగిన చర్చను చంద్రబాబు వివరించారు. పట్టిసీమకు అడ్డుపడే ప్రయత్నం చేశారని వైసీపీ తీరును చంద్రబాబు దుయ్యబట్టారు. 2019 మధ్య కాలంలో వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల సీమకు నీరు చేరలేదని ముఖ్యమంత్రి వెల్లడించారు. కుప్పం బ్రాంచ్ కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ను ముఖ్యమంత్రి సందర్శించారు. రిజర్వాయర్లల్లో నీరు ఏ విధంగా నింపుతున్నాం.. ప్రవాహాలు వస్తున్న తీరును జనానికి అర్థమయ్యేలా సీసీ కెమెరాల ద్వారా లైవులో చూపించే ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. నీటి విలువ, ఇరిగేషన్ కోసం ఎంత ఖర్చు పెడుతున్నామనే అంశాలను, ఎన్ని రోజుల్లో నీటిని తరలించామనే విషయాలను వివరిస్తూ లైవ్ డెమానిస్ట్రేషన్ ఇవ్వాలని సీఎం సూచించారు. హంద్రీ-నీవా కాల్వ విస్తరణ పనుల పైలాన్‌ను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు.

## పట్టణ రవాణా వ్యవస్థను పటిష్టపరచలేరా...

డా. యం. సురేష్ బాబు, అధ్యక్షుడు, ప్రజాసైన్స్ వేదిక. 9989988912



**అనంతపురం పెన్ పవర్ ఆగస్టు 30 :** భారతదేశ నగరాలు స్తబ్దుగా ఉన్నాయి. ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నారు రోడ్డు వెడల్పు చేస్తున్నారు, అయినప్పటికీ ట్రాఫిక్ చాలా దుర్లభంగా ఉంటుంది. మెట్రో నెట్‌వర్క్ లను ఏర్పరుస్తారు, అయినప్పటికీ ప్రయాణికులు ఇప్పటికీ రద్దీగా ఉండే బస్సులు పట్టుకుని వేలాడుతున్నారు, లేదా ఆటో-రిక్షాల కోసం తీవ్రంగా వెతుకు తారు. సమస్య తక్కువ రహదారి స్థలం గురించి కాదు, మనం దానిని ఎలా ఉపయోగించాలని ఎంచుకున్నామో దాని గురించి. భారతదేశ నగరాలు ట్రాఫిక్, కాలుష్యం చలనశీలతకు ప్రాప్యత అసమానతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ జనరల్ సునీతా నారాయన్ చాలా కాలంగా మనం కదిలే విధానం మన నగరాల ఆరోగ్యాన్ని ప్రతిబింబిస్తుందని ప్రస్తావిస్తున్నారు. ఆమె విశ్లేషణలో, పట్టణ రవాణా సంక్షోభం కేవలం రోడ్డు రద్దీ గురించి కాదు, వాయు కాలుష్యం, ప్రజారోగ్యం, అసమానత, పట్టణ రవాణా ప్రణాళిక యొక్క వక్రీకృత ప్రాధాన్యతల యొక్క సంక్లిష్ట పరిస్థితి గురించి. ట్రాఫిక్ సమస్య ప్రధాన అంశం ప్రైవేట్ వాహనాలలో, ముఖ్యంగా కార్లు విపరీతమైన పెరుగుదల, ఇది అసమానంగా తక్కువ సంఖ్యలో ప్రజలను తరలిస్తూనే చాలా తక్కువ మొత్తంలో రహదారి స్థలాన్ని వినియోగిస్తాయి. ఇటీవల కాలంలో చాలా రాష్ట్రాల్లో తగ్గుముఖం పడుతున్న బస్సులు, పెరుగుతున్న కార్లు ప్రైవేటు వాహనాలు దీనికి మరింత ఆజ్యం పోస్తోంది. దేశంలో పట్టణాల్లో బస్సులు బాగా క్షీణించాయి. లక్ష కంటే ఎక్కువ జనాభా ఉన్న భారతదేశంలో 458 నగరాల్లో 63 మాత్రమే అధికారిక బస్సు వ్యవస్థలను కలిగి ఉన్నాయి. చైనాలో ఆరు నగరాలతో పోలిస్తే భారతదేశంలో 1,000 మందికి కేవలం 1.2 బస్సులు మాత్రమే ఉన్నాయి, ఇది స్పష్టమైన లోటు. మెట్రో రైలు వ్యవస్థ విస్తరిస్తున్నప్పటికీ, మెజారిటీ ప్రయాణికులకు సేవ చేయడానికి సరిపోదు. నమ్మదగిన ప్రజా రవాణా లేనప్పుడు, ఆటో-రిక్షాలు, మినీ-బస్సులు, రైడ్-హెయిలింగ్ యాప్‌లు బైక్-టాక్సీలు వంటి అనధికారిక పరిష్కారాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. కానీ అది క్రమబద్ధీకరించబడనివి, మొబైల్ యాప్ కలిగి ఉండడం, ఇంటర్నెట్ తో అనుసంధానం అయి ఉండడం అలాగే ప్రభుత్వ రవాణా రంగానికి సరిపోవు. సామూహిక రవాణా రంగంలో ఈ వైఫల్యం సమాజాన్ని అల్లకల్లోలం చేసే పరిణామాలను కలిగి ఉంది. రద్దీ మరింత తీవ్రమవుతుంది, గాలి నాణ్యత క్షీణిస్తుంది, రోడ్డు ప్రమాదాలు పెరుగుతాయి. 2023 లో, ట్రాఫిక్ ప్రమాదాల వల్ల 172,000 మందికి పైగా ప్రాణాలు కోల్పోయింది, రోజుకు సగటున 474 మంది మరణించారు. వాహన ఉద్గారాల వల్ల కలిగే కాలుష్య స్థాయిలు, ప్రపంచంలోని అత్యంత కలుషితమైన టాప్ 15 నగరాల్లో 14 భారతీయ నగరాలు ఉన్నాయి. ఇది కేవలం అసౌకర్యాలు మాత్రమే కాదు, ప్రజారోగ్య అత్యవసర పరిస్థితులు. పట్టణ రవాణా ప్రణాళిక బహుళ సంస్థలలో విచ్ఛిన్నమై సంక్లిష్టం గా తయారయ్యింది, భూసేకరణ సంవత్సరాలుగా జరుగుతూ ప్రాజెక్టులను ఆలస్యం చేస్తుందిబీ ప్రజా రవాణా సేవలు నిధులు తక్కువగా ఉండటం, పేలవమైన బడ్జెట్ కేటాయింపులు బస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ వంటి ప్రయత్నాలు పేలవమైన అమలులో కూలిపోతున్నాయి. ఇప్పుడు మనకు ఉన్నది కార్ పక్షపాత వ్యవస్థ, ఇది ప్రజా రవాణాపై ఆధారపడే ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వం నిర్లిప్త ధోరణి అవలంబిస్తోంది. భారతదేశంలో చలనశీలత కూడా అసమానత ఎదుర్కొంటున్నది. తక్కువ-ఆదాయ కుటుంబాలు నగర పరిధులకు నెట్టబడుతున్నాయి, దీర్ఘ ఖరీదైన ప్రయాణాలతో భారం పడుతున్నాయి. ప్రజా రవాణా ఉన్నప్పటికీ, ఇది తరచుగా భరించలేనిది లేదా సురక్షితం కాదు. అద్భుతంగా ప్రశంసించబడిన ఢిల్లీ మెట్రో, తక్కువ ఆదాయ సమూహాలకు ప్రపంచంలోనే అత్యంత భరించలేని వాటిలో ఒకటిగా ఉంది, అల్పాదాయ వర్గాల వారు నెలవారీ ఆదాయంలో దాదాపు 22% వినియోగిస్తున్నారు. మహిళలకు, చలనశీలత కేవలం భరించగలిగే సామర్థ్యం ద్వారానే కాదు, భద్రత ద్వారా కూడా పరిమితం చేయబడింది. రద్దీగా ఉండే బస్సులు, అసురక్షిత బహిరంగ ప్రదేశాలు ప్రధాన నగరాల్లో 79% మంది మహిళలు వేధింపులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం సంక్షోభాన్ని పట్టించుకోలేదు. సంవత్సరాలుగా జెఎన్ఎన్యుఆర్ఎం నుంచి అమృత్ వరకు, మెట్రో రైల్ పాలసీ నుండి నేషనల్ పబ్లిక్ సైకిల్ స్కీమ్ వరకు విధానాలు, మిషన్లు పట్టణ చలనశీలతను మరింత కలుపుకొని మరియు స్థిరంగా మార్చడం లక్ష్యంగా పెట్టుకున్న ఆశించిన స్థాయిలో ప్రజలకు చేరువ కాలేదు. మెట్రో వ్యవస్థ 17 నగరాలకు విస్తరించాయి, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నారు, బస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్స్ మరియు సైకిల్-షేరింగ్ పథకాలు వంటి పైలట్ ప్రాజెక్టులు జరుగుతున్నాయి. అయినప్పటికీ నిర్మాణాత్మక సమస్యలు అలాగే ఉన్నాయి. విచ్ఛిన్నమైన సంస్థాగత బాధ్యతలు, చట్టాల పేలవమైన అమలు, భూసేకరణలో జాప్యం, దీర్ఘకాలిక నిధుల కొరత ప్రతిష్టాత్మక ప్రణాళికలను పట్టాలు తప్పిస్తాయి. పెట్టుబడులు ఇంటిగ్రేటెడ్, మల్టీ మోడల్ రవాణా వ్యవస్థలను నిర్మించడానికి బదులుగా రోడ్లు ఫ్లైఓవర్లను అసమానంగా ఆదరిస్తున్నారు. నీతి ఆయోగ్ 3సి ఫ్రేమ్‌వర్క్ - శుభ్రమైన, సౌకర్యవంతమైన మరియు రద్దీ లేని వ్యవస్థను ప్రతిపాదించింది . ప్రజా రవాణా అందుబాటులోకి వచ్చే, మోటారు లేని రవాణాకు ప్రాధాన్యత ఇవ్వబడే విద్యుత్ చలనశీలతకు ప్రాధాన్యత ఇవ్వబడే భవిష్యత్తును ఇది ఊహించింది. కానీ దీనిని గ్రహించడానికి ఒక నమూనా మార్పు అవసరం అన్నారు.

## కొమరోలులోని ప్రగతి జూనియర్ కళాశాలలో నిత్య పూజలు అందుకుంటున్న గణనాథుడు

గత ఐదు రోజులుగా నిత్య అన్నదానం నిర్వహిస్తున్న కళాశాల నిర్వాహకులు



**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 30 :** కొమరోలు లోని ప్రగతి జూనియర్ కళాశాల ఆవరణలో ఈనెల 27వ తేదీన ఏర్పాటుచేసిన గణనాథుడు గత ఐదు రోజులుగా నిత్య పూజలు అందుకుంటున్నాడు .వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రగతి కళాశాల డైరెక్టర్ కందుల సందీప్ రెడ్డి దంపతులు, అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి కళాశాల ఆవరణలో ఈ నెల 27వ తేదీ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు .అప్పటినుంచి ప్రతిరోజు గణనాథునికి పూజలు నిర్వహిస్తున్నారు. అంతేకాక గత ఐదు రోజులుగా నిత్య అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆ కార్యక్రమంలో ఆ కళాశాల అధ్యాపకులు విద్యార్థులతో పాటు పరిసర వీధులకు చెందిన ప్రజలు మొత్తం రోజుకు 300 మంది




చొప్పున పాల్గొంటున్నారని కళాశాల డైరెక్టర్ సందీప్ రెడ్డి తెలిపారు. ఈనెల 31వ తేదీ ఆదివారం గణనాథుని విగ్రహానికి నిమజ్జన కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ,ఆ సందర్భంగా కళాశాల ఆవరణలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి కోలాటం, తదితర సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నామని, వాటితో పాటు 11 గంటల నుంచి వరసిద్ధి వినాయక స్వామి లడ్డు వేలంపాట నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. వేలంపాటలో తమ కళాశాల విద్యార్థులతో పాటు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు కులమతాలకు అతీతంగా పాల్గొనవచ్చని ఆయన తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి కళాశాల ఆవరణలో దాదాపు 400 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లుగా ఆయన తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి గణనాథుని విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో అలంకరించి పట్టణంలోని వీధులలో ఊరేగింపు నిర్వహించి, సాయంత్రం నిమజ్జన కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లుగా ఆయన తెలిపారు. కావున మండలంలోని ప్రజలు, కళాశాల శ్రేయోభిలాషులు, కళాశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరై కార్యక్రమాలు విజయవంతం చేయాలని సందీప్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## మీ హృదయంలోకి లోతుగా వెళ్లి చూడండి, ఈ ప్రపంచంలో నిజంగా చెడ్డ వ్యక్తులు ఎవరైనా ఉన్నారా? : అప్పల రెడ్డి సింధు




కడప పెన్ పవర్ ఆగస్టు 30 : సాధువు యొక్క దుప్పటి ఒకరోజు రాత్రి ఒక సాధువు గుడిసెలోకి దొంగలు చొరబడ్డారు. అక్కడ సాధువు కప్పుకునే ఒక దుప్పటి తప్ప ఆ ఇంట్లో ఏమీ లేదు. అది ఒక చల్లని రాత్రి. సాధువు తన ఇంట్లోకి దొంగలు చొరబడ్డారని, వారు దొంగిలించడానికి తనవద్ద ఏమీ లేదని ఏడుపు ప్రారంభించాడు ... ఇది అతనికి చాలా బాధాకరమైన పరిస్థితి. అతని ఏడుపు విన్న దొంగలు "సోదరా, ఎందుకు ఏడుస్తున్నావు?" అని అడిగారు. దానికి సాధువు బదులిస్తూ, "మీరు నా జీవితంలో మొదటిసారి వచ్చారు - నాకు ఈ మంచి అవకాశం ఇచ్చారు!ఎవరైనా దొంగలించడానికి పేద సాధువుల వద్దకు వెళ్లరు, చక్రవర్తుల వద్దకు వెళతారు. కానీ మీరు దొంగతనం చేయడానికి నా వద్దకు వచ్చారు, నన్ను చక్రవర్తిని చేశారు. ఎంతటి అదృష్టం! ఇది తలుచుకుని నా కళ్ళు చెమ్మగిల్లాయి, నా ఏడుపును నియంత్రించుకోలేకపోయాను, ఎందుకంటే నా ఇంట్లో ఏమీ లేదు. మీరు నాకు రెండు రోజుల ముందే తెలియజేసి ఉంటే, నేను ఏదో ఏర్పాటు చేసి ఉండేవాడిని. నాకు రెండు మూడు రోజులు సమయం దొరికితే అప్పు చేసుండేవాడిని, ఎవరినైనా సాయం అడిగివుండేవాడిని, ఎక్కడో ఏదో ఒకటి వసూలు చేసేవాడిని.

కానీ ప్రస్తుతం నా దగ్గర ఈ దుప్పటి మాత్రమే ఉంది, దీన్ని మీతో తీసుకెళ్లండి. దయచేసి వద్దు అని చెప్పకండి. మీరు నిరాకరిస్తే, నా హృదయం తీవ్రంగా గాయపడుతుంది, అని అన్నాడు. దొంగలు భయపడిపోయారు, వారికి ఏమీ అర్థం కాలేదు. ఇలాంటి వ్యక్తిని వారు ఎప్పుడూ కలవలేదు. వారు తమ జీవితమంతా దొంగతనాలు చేస్తూ ఉన్నారు, కానీ ఇలాంటి వ్యక్తిని మొదటిసారి చూశారు. మొట్టమొదటి సారి వారి కళ్లలో అవమానం కనిపించింది, మొదటిసారి కాదన్నవారి ఎదుట సిగ్గుతో తలవంచారు. తీసుకోవడం కష్టమే అనిపించినా, 'వద్దు', అని అతనిని బాధించటం ఇష్టంలేక దుప్పటి తీసుకున్నారు! దుప్పటి తీసేసరికి ..... ఆ సాధువుకి వేసుకోవడానికి ఇంకేమీ లేదని స్పష్టంగా తేలిపోయింది. దుప్పటి ఒక్కటే అతని కవచం - అదే అతని బట్టలు, అదే అతని పరుపు. ఆ పరిస్థితిలో చిక్కుకున్నందుకు దొంగలకి చాలా వింతగా అనిపించింది, వెంటనే వారు గుడిసెలో నుండి బయటకు వచ్చేసారు. వాళ్ళు వెళ్ళేటప్పుడు సాధువు గట్టిగా," కనీసం నాకు కృతజ్ఞతలు చెప్పి, తలుపులు మూసి వెళ్ళండి" అని అరిచాడు. "ఇదేమి విచిత్రమైన వ్యక్తి," అని దొంగలు అనుకున్నారు. సాధువు అంత అధికారంతో చెప్పేసరికి, వారు అతనికి కృతజ్ఞతలు తెలిపి, తలుపు మూసి, వెంటనే పారిపోయారు. సాధువు కిటికీ దగ్గర నిలబడి దొంగలు వెళ్లిపోవడం చూసాడు. కొన్ని రోజుల తర్వాత ఆ దొంగలు పట్టుబడ్డారు. న్యాయస్థానంలో విచారణ జరిగింది, సాధువు దుప్పటి కూడా పట్టుబడింది. సాధువు అందరికీ పరిచయం ఉండడం వలన, అతని దుప్పటి కూడా అందరికీ తెలుసు. ఆ దుప్పటి చాలా ప్రఖ్యాతి చెందింది. అది సాధువు దుప్పటి అని న్యాయాధిపతి వెంటనే గుర్తించాడు. " మీరు ఆ సాధువు వద్ద నుండి కూడా దొంగిలించారా?" అని దొంగలను గదమాయించాడు. సాధువును పిలిపించారు. న్యాయాధికారి, "ఇది అతని దుప్పటి అని, మీరు దానిని దొంగిలించారని ఆ సాధువు మాకు చెప్పినట్లయితే, మాకు వేరే రుజువు అవసరం లేదు, ఈ సాధువు ఇచ్చే వ్కాలం వెయ్యి మంది ఇచ్చినదాని కంటే గొప్పది. అప్పుడు నేను మీకు అత్యంత కఠినమైన శిక్ష విధిస్తాను", అన్నాడు. దొంగలు భయాందోళనలతో వణికిపోయారు. సాధువు న్యాయస్థానికి వచ్చినప్పుడు, అతను అధికారితో ఇలా అన్నాడు, "ఈ వ్యక్తులు దొంగలు కాదు, వారు చాలా మంచి వ్యక్తులు, నేను వారికి దుప్పటి ఇచ్చాను, వారు నాకు కృతజ్ఞతలు తెలిపారు, వారు తిరిగి నాకు ధన్యవాదాలు చెప్పినప్పుడు, దొంగిలించడం అన్న ప్రశ్న లేదు కదా ... నేను వారికి దుప్పటి ఇచ్చాను, వారు నాకు కృతజ్ఞతలు తెలిపారు. అంతే కాదు, వారు చాలా మంచి వ్యక్తులు, వెళ్ళేటప్పుడు, వారు తలుపులు కూడా మూసి వెళ్లారు."వారిని వేధించవద్దు, వారు చాలా ప్రియమైన వ్యక్తులు, మంచి వ్యక్తులు, బాగా అర్థం చేసుకునే వ్యక్తులు." అప్పుడు న్యాయాధికారి దొంగలను విడిచిపెట్టాడు, దొంగలు సాధువు పాదాలపై పడి, "దయచేసి మాకు దీక్ష ఇవ్వండి" అన్నారు. దొంగలు సాధకులు అయ్యారు. తరువాత సాధువు కడుపుబ్బ నవ్వాడు. అతను ఇలా అన్నాడు, " మీరు సాధుత్వం పొందడం కోసమే ఈ దుప్పటి మీకు సమర్పించబడింది. మీరు దాని నుండి తప్పించుకోలేరు. నా ప్రార్థనలన్నీ ఈ దుప్పటిలో అల్లిబడి ఉన్నాయి." "జీనీ-జీనీ బీనీ రే చదరియా" (ఈ దుప్పటి చాలా సూక్ష్మంగా నేయబడింది) ఇది దైవప్రార్థనలతో అల్లబడింది. నేను దీనిని ధరించి ధ్యానం చేసేవాడిని. ఇది సమాధి / ధ్యానం అనే వర్ణంతో, దివ్యత్వపు సువాసనతో రంగరించబడింది. దీని నుండి మీరు తప్పించుకోలేకపోయారు. ఈ దుప్పటి మిమ్మల్ని ఇక్కడకి రప్పిస్తుందని నాకు తెలుసు. ఆ రోజు దొంగలుగా వచ్చారు, ఈ రోజు శిష్యులుగా మారారు. ఈ ప్రపంచంలో చెడ్డ వ్యక్తి అనేవాడు ఉండడు అన్నది నా విశ్వాసం." ప్రేమ మనలో మార్పులను తీసుకువస్తుంది, మనం ఇంకా మంచిగా తయారయ్యే మార్పులు. మన హృదయంలో ఎల్లప్పుడూ ప్రేమపూర్వక వాతావరణాన్ని నిలుపుకుంటే, అది మనల్ని మంచి మనుషులుగా తయారుచేస్తుంది.

**దాజీజి.. హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం అనువాద బృందం ఆంధ్రప్రదేశ్**

# వైఎస్ఆర్ కడప అన్నమయ్య జిల్లాల ఉమ్మడి జడ్పీ సర్వసభ్య సమావేశం







కడప, పెన్ పవర్ ఆగస్టు 30 : ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని అభివృద్ధి కార్యక్రమాలను కార్యదీక్షతో, అంకిత భావంతో పూర్చి చేసి.. ప్రజలకు ఎలాంటి కొరత లేకుండా చూడాలని.. వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో.. జెడ్పి చైర్మన్ రాంగోవిందరెడ్డి అధ్యక్షతన వైఎస్ఆర్ కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల జడ్పి సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సర్వసభ్య సమావేశానికి.. వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు, రాష్ట్ర ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే సి. ఆదినారాయణ రెడ్డి, జెడ్పి సీఈవో ఓబులమ్మ, ఎమ్మెల్సీలు రాంగోపాల్ రెడ్డి, పి. రామసుబ్బా రెడ్డి, రామచంద్రా రెడ్డి, కమలాపురం, ప్రొద్దుటూరు ఎమ్మెల్యేలు కృష్ణ చైతన్య రెడ్డి, నంద్యాల వరదరాజుల రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాష్, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.కార్యక్రమంలో ముందుగా.. పులివెందుల, ఒంటిమిట్ట నూతన జెడ్పిటీసీ సభ్యులుగా ఎన్నికైన మారెడ్డి లతారెడ్డి, అద్దలూరు ముద్దు కృష్ణారెడ్డి లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాలా మంచి చేసేందుకే అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రజలకు సంతృప్తి కరమైన కనీస, మౌలిక సదుపాయాలను కల్పించే దిశగా సమస్యలు లేని జిల్లాగా తీర్చిద్దేందుకు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఇప్పటి వరకు చేపట్టిన అన్ని అభివృద్ధి పలనులను, గతంలో చేపట్టి ఇప్పటివరకు పెండింగ్ లో ఉన్న పనులను కుడా ప్రణాళిక ప్రకారం పూర్తిచేసేలా చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. అలాగే ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో అధికారులతో పాటు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పనిచేయాలన్నారు. జిల్లాలో ఎలాంటి ఎరువుల కొరత లేదని ఖరీఫ్ ప్రారంభంలోనే 12 వేల మెట్రిక్ టన్నులు పంపిణీ చేసామన్నారు. ఇంకనూ సీజన్ అవసరానికి సరిపడా ఇండెంట్ పెట్టడం జరిగిందన్నారు. ఆర్.ఎస్.కే. లు, డీలర్ల వద్ద యూరియా అందుబాటులో ఉంది. విడతల వారీగా పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. జిల్లా ఆర్&బి సంబంధిత శాఖలలో ప్రభుత్వ ధనాన్ని అక్రమంగా సొంతానికి వాడుకుంటున్నట్లు ఆరోపణలు వచ్చిన అధికారులపై కచ్చితంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వికలాంగ పెన్షన్లలో అనర్హులకు తొలగించే ప్రక్రియలో.. సదరం బోర్డు ద్వారా రీ వెరిఫికేషన్ చేపట్టి నిజంగా అర్హతలు ఉన్న వారికి న్యాయం జరిగేలా చేస్తామన్నారు. నిజంగా అర్హతలు ఉండి నష్టపోతున్నాము అని భావించేవారు.. చాలామంది అప్పీలు వేయడం జరిగిందని.. విచారణ పూర్తి అయ్యేవరకు పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. సర్వసభ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలను.. పరిశీలించి వచ్చే సమావేశం నాటికి అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి వైఎస్సార్ కడప జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. అంతకుముందు అజెండా అంశాల వారీగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికను సమర్పించగా.. పలువురు సభ్యులు లేవనెత్తిన అంశాలపై అధికారులు సమాధానాలిచ్చారు. చక్రాయపేట మండలంలో వర్షపాతం తక్కువగా ఉందని, కరువు మండలంగా ప్రకటించాలని, ఈ ప్రాంతంలో పంటలకు యూరియా అవసరం.చాలా ఉందని, వెంటనే పంపిణీ చేయాలని.. ఆ మండల జడ్పిటిసి సంభ్యులు కోరారు. కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లు అందక నానా అవస్థలు పడుతున్నారని.. ప్రభుత్వం నుండి బిల్లులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు జెడ్పిటిసీ సభ్యులు సభాధ్యక్షుల దృష్టికి తీసుకువచ్చారు. జాయింట్ ఎల్.పి.ఎం. రికార్డుల విషయంలో రెవెన్యూ వారి తప్పిదాల వల్ల చాలా మంది రైతు కుటుంబాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను కోల్పోతున్నారని.. ఈ విషయంపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కు తెలియజేసారు. జెడ్పి చైర్మన్ రామ్ గోవింద్ రెడ్డి అలాగే.. ఎకరాకు ప్రభుత్వం అందిస్తున్న 100 కేజీల సబ్సిడీ యూరియా ఏ మాత్రం సరిపోవడం లేదని.. 200 కేజీల యూరియా సరఫరా చేయాలని.. సభా ముఖంగా తెలిపారు. ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని ఆర్బికే ఫెసిలిటేషన్ సెంటర్ కు ఇప్పటికీ పాత బోర్డుతోనే.. వైఎస్ఆర్ ఆర్బికే ఫెసిలిటేషన్ సెంటర్ అని.. వుండడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ రామ చంద్రారెడ్డి మాట్లాడుతూ.. కడప నగర పరిసరాల్లో కూడా పలు చెరువులు ఉన్నాయని.. కొంతమంది ఆక్రమణ దారులు కబ్జాలకు పాల్పడుతున్నారని, ఊటుకురు చెరువులో ఒక ఆయిల్ మిల్ కూడా నిర్వహణలో ఉందని అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొంతమంది టీచర్లను 20 ఏళ్లుగా డిప్యుటేషన్ పైన డీఈవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారని.. వారిని తరగతులకు వెళ్లేలా చూడాలని కోరారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడీ లు మాట్లాడుతూ.. రైతు సేవా కేంద్రాల్లో రైతులకు సంతృప్త స్థాయిలో సేవలు అందడం లేదని, క్షేత్ర స్థాయిలో అధికారులు గమనించాలని సభా దృష్టికి తెచ్చారు. అలాగే... అనర్హులైన పెన్షనర్లను లబ్ధిదారుల జాబితా నుండి తొలగించే ప్రక్రియ చేపట్టడంలో.. చాలామంది నిజమైన లబ్ధిదారులు నష్టపోతున్నారని తెలిపారు.ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో రైతులకు వ్యవసాయ సాగు, ఎరువుల యాజమాన్యంపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అధిక మోతాదులో ఎరువులు వాడటం.. కూడా అనేక అనర్ధాలకు దారితీస్తుందని, వ్యవసాయ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే.. సర్వసభ్య సమావేశంలో లేవనెత్తిన సమస్యలను.. తర్వాత జరిగే సర్వసభ్య సమావేశం లోపు.. పరిష్కారం చూపాలని అధికారులకు తెలిపారు. కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఎల్లటూరు, ఎర్రబల్లె రహదారుల పరిస్థితి సరిగా లేదని, ఆర్&బి అధికారులు దృష్టి సారించాలని తెలియజేసారు. చెన్నూరు పట్టంలో పెండింగ్ లో ఉన్న సర్వీస్ రోడ్డు సమస్యను తీర్చాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశానికి వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు హాజరయ్యారు.

## ఉన్నత విద్య అంతా మిథ్య-ప్రమాదపుటంచున ఉన్నత విద్య

డా. ముచ్చుకోట సురేష్ బాబు, విద్య పరిరక్షణ కమిటీ , 9989988912



ధర్మవరం పెన్ పవర్ ఆగస్టు30 : ఆంధ్రాలో కూటమి ప్రభుత్వం వచ్చి పదిహేను నెలలు గడుస్తున్నా ఉన్నత విద్యను విస్మరించారు, ఇంకా కొన్ని విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులు లేరు, తల్లికి తిండి పెట్టలేదు కానీ పిన్నమ్మకు బంగారు గాజులు కొని పెడుతున్నారంటే వెనకటికి ఒకడు, ఉన్న ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు చక్కపెడదామన్న ఉద్దేశం లేదు ఉత్తరాంధ్రకు జార్జియా యూనివర్సిటీ తెస్తున్నారు మన లోకేష్ బాబు. ఆంధ్రాలో విద్యారంగం ప్రపంచానికి రోల్ మోడల్ అవుతుంది అని ఉత్తర ప్రగల్భాలు పలుకుతున్నారు. ప్రభుత్వ విద్యాలయాలను బలోపేతం చేయకుండా ఎలా సాధ్యపడుతుందో అర్థంకావడం లేదు. స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీ లో చదివిన విద్యాశాఖ మంత్రి ప్రవచనాలు బోధించే బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు విద్యార్థులకు నైతికత మానవ సంబంధాలు మెరుగుపడడానికి సలహాదారులుగా నియమించి విద్యార్థులకు శాస్త్రీయ స్పృహ, శాస్త్రీయ తెంపరితనం ఇంకిత జ్ఞానం లేకుండా పాతరేశారు. కొత్త సినిమాలకు ఆఘమేఘాల మీద రేట్లు పెంచి అజ్ఞానాన్ని, అవివేకాన్ని, అస్లీలత ప్రజలకు చేరువ చేసే పనిలో ఉన్నారు. కూటమి ప్రభుత్వం రే మామ ఏక్ పెగ్ లా అంటూ దబిడి దిబిడే పాటల్లో నటించిన వారికి పద్మ అవార్డులు ఇచ్చి సత్కరిస్తున్నారు. ఊడిపోయే జుట్టు ఎంత ఒత్తిన ఏముంది అంటాడు సినారె, అయ్యవార్లు లేక, రీసర్చ్ గ్రాంటులు, బ్లాక్ గ్రాంట్స్ లేక శ్మశాన ప్రశాంతత నెలకొన్న విశ్వవిద్యాలయాలలో ఏడాదికి రెండు సార్లు అడ్మిషన్లని యూజీసీ ప్రకటించింది. దశాబ్దకాలంగా దేశంలో విశ్వవిద్యాలయాలలో చలనం లేకుండా పోయింది. విశ్వవిద్యాలయాల పరిస్థితి సమీక్షించుకుంటే అశాంతి, అలజడులు, సుదీర్ఘ పోరాటాలకు ప్రధాన కారణం బోధన సిబ్బంది నియామకాలే అని గ్రహించగలం. బోధన, పరిశోధన, క్రమశిక్షణ, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడాలంటే అధ్యాపకులను నియమించాల్సిందే. విశ్వవిద్యాలయాలకు అద్భుతాలు సృష్టించే శక్తి ఉంది, విద్యారంగంలో అత్యంత కీలకం తరగతి బోధనేనని ప్రభుత్వం గ్రహించాలి. విద్యార్థులపై తరగతి బోధన విధానం తీవ్ర ప్రభావం చూపుతుంది, అధ్యాపకులు సైతం విద్యార్థులను ప్రభావితం చేసే విధంగా బోధన విధానాలు, సామర్థ్యాలు ఉన్నతీకరించుకోవాలి. విశ్వవిద్యాలయం పరీక్షల్లో అనేక మార్పులు తీసుకు రావాల్సిన అవసరం ఉంది, అలాగే వివిధ వర్శిటీల్లో అమలులో ఉన్న పరీక్షల విధానం సమగ్ర అధ్యయనం చేసి విద్యార్థులకు లాభం చేకూర్చే పద్ధతిని అవలంబించుకోవాలి. విద్యా విధానంలో నాణ్యత తగ్గిపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి, ప్రధానంగా పాలన, ఆర్థిక వనరుల కేటాయింపు, పరిశోధన ప్రగతి, ఏపీఐ స్కోర్, పర్ఫామెన్స్ బేస్డ్ అకడమిక్ స్కోర్ వంటి కీలకాంశాలు విద్యా రంగంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఉన్నత విద్యాధికారులు ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ఇస్తూ వీటిలో సీట్లు భర్తీ అయిన తర్వాత మొక్కుబడిగా అడ్మిషన్లు చేపడుతున్నారు. ప్రైవేటు విద్యాసంస్థలలో సీట్ల భర్తీ జూన్ నెలలో ముగుస్తుంది, ఇక్కడ ఆగస్టు అయినా అడ్మిషన్ ప్రక్రియ మొదలవదు. పరిస్థితి ఇలాగే ఉంటే 2030 నాటికి దేశంలో 80 శాతం ప్రైవేటు విశ్వవిద్యాలయాలు ఏర్పడతాయి. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఇంజనీరింగ్ కళాశాల కనీసం ఇరవై శాతం సీట్లు భర్తీ కాక మూసివేశారు. డిప్లొమా విద్య ఇంకా దారుణంగా కేవలం 35 శాతం అడ్మిషన్లు అయింది పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. విశ్వవిద్యాలయాలకు మరింత స్వేచ్ఛను అందించినప్పుడే ఉన్నత విద్య, పరిశోధన రంగంలో నాణ్యత మెరుగుపడుతుంది అలాగే దేశీయ విశ్వవిద్యాలయాలలో విద్య పరిశోధన రంగంలో అంతర్జాతీయ విద్యా సంస్థల పోటీ పడాలంటే రీసెర్చ్ గ్రాంట్లు, మైనర్, మేజర్ ప్రాజెక్టులు రూపకల్పన చేయాలి. ఇప్పుడు విశ్వవిద్యాలయాల్లో సెంటర్ ఆఫ్ పొటెన్షియల్ ఎక్సలెన్స్ ఉన్న విభాగాలు ఒక్కటీ లేదు. దేశంలో ఉన్నత విద్య రంగానికి కేటాయిస్తున్న నిధులు ఇతర అన్ని రంగాల కంటే అత్యల్పంగా ఉంది. దేశ స్థూల జాతీయ ఉత్పత్తిలో ఉన్నత విద్యారంగానికి కేటాయించే నిధులు పెంచడంతోపాటు వివిధ మార్పులకు అవకాశం కల్పించాలి . విశ్వవిద్యాలయాలు గుర్తింపులు ఇవ్వడాన్ని రద్దు చేసి, పరీక్షా విధానంలో సమూల మార్పులు తీసుకు వచ్చినప్పుడు విద్యా రంగంలో నాణ్యతతో కూడిన ప్రమాణాలు మెరుగుపడతాయి. విద్యారంగానికి దశాబ్దం క్రితం వరకు ఎంతో ప్రాధాన్యం ఉండేది, విశ్వవిద్యాలయాలు సమాజ ఉన్నతికి దోహదపడే విధంగా ఉండాలన్నారు.

## నారాయణదాసు 160వ జయంతి మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి





తిరుమల పెన్ పవర్ ఆగస్టు 30 : హరికథా పితామహునిగా వినుతికెక్కిన శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాస 160వ జయంతిని ఆగష్టు 31వ తేదీ తిరుపతి మహతి కళాక్షేత్రంలో వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇందులో భాగంగా ఉదయం 8.30 గంటలకు ఎస్వీ సంగీత కళాశాల ప్రాంగణంలోని శ్రీ ఆదిభట్ట నారాయణదాసు విగ్రహానికి పుష్పాంజలి ఘటించి, బృందగానం నిర్వహిస్తారు. అనంతరం మహతి కళాక్షేత్రంలో ఉదయం 9 గంటల నుండి హరికథ ప్రాశస్త్యము, హరికథ-ధర్మ ప్రచారం, శ్రీ ఆదిభట్ల నారాయణదాసు జీవిత విశేషాలు, ప్రముఖ కళాకారులతో హరికథాగానం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సెప్టెంబరు 1 నుండి 10వ తేదీ వరకు "హరికథ వైభవం" సెప్టెంబరు 1 నుండి 10వ తేదీ వరకు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హరికథ కళాకారులకు " హరికథ వైభవం " పేరిట శిక్షణ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమం వారి నైపుణ్యాలను మెరుగు పరచుకునేందుకు ఉపయోగపడనుంది. ఎంపిక చేసిన 180 మంది హరికథకులకు తిరుపతి శ్వేత భవనంలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు.

## ఐదేళ్లుగా నిలిచిన నిమజ్జనోత్సవాలను పునరుద్ధరించిన మంత్రి సత్య కుమార్ : హరీష్ బాబు






ధర్మవరం, పెన్ పవర్ ఆగస్టు 30 : ధర్మవరం పట్టణంలో శనివారం జరిగిన గణపతి నిమజ్జన కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య, ప్రశాంతంగా ముగిసింది. వేలాది మంది హైందవ భక్తులు తమ గణేశ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి, నిమజ్జనం చేసి ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ ఆదేశాల మేరకు పట్టణంలో అద్భుతమైన ఏర్పాట్లు చేపట్టబడ్డాయి. నిమజ్జనం సౌకర్యార్థం రెండు భారీ క్రేన్లు ఏర్పాటు చేయడమే కాకుండా, పట్టణంలోని ప్రధాన కూడళ్ళు, వీధులు, చెరువు పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు బందోబస్తు కల్పించబడింది. ట్రాఫిక్ అంతరాయం లేకుండా నిమజ్జనం సజావుగా సాగేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేశారు. పోలీసు శాఖ, మున్సిపల్ శాఖ, వైద్య శాఖ, విద్యుత్ శాఖ తదితర సంబంధిత అన్ని శాఖలతో సమన్వయం సాధించి, నిమజ్జనం సందర్భంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మంత్రివర్యులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు మాట్లాడుతూ,...,, గత ఐదు సంవత్సరాలుగా ధర్మవరం చెరువులో గణేష్ నిమజ్జనాలు నిలిపివేయబడ్డాయి. అయితే, గత సంవత్సరం సత్య కుమార్ యాదవ్ ధర్మవరం శాసనసభ్యులుగా గెలిచిన తరువాత ఆయన ఆదేశాల మేరకు ధర్మవరం చెరువులో గణేష్ నిమజ్జనాలు పునరుద్ధరించబడ్డాయి. హిందూ సమాజంలోని ప్రతి ఒక్కరు తమ సనాతన ధర్మాన్ని ఆచరిస్తూ సంతోషంగా, ఆనందంగా గణేష్ ఉత్సవాలను నిర్వహించుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతోంది అని పేర్కొన్నారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా, శాంతియుతంగా సాగేందుకు హరీష్ బాబు స్వయంగా ఊరేగింపుల దగ్గర నుండి చెరువు వద్ద నిమజ్జనం జరుగుతున్న వరకూ నిరంతరం పర్యవేక్షించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసి సమస్యలు తక్షణమే పరిష్కరించారు.

# ఆనందోత్సహాలతో గణేష్ నిమజ్జనం

సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 30 : మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో యువత ఉత్సాహంతో, మహిళలు పూజలు కాయ కర్పూర సమర్పణ, డీజే లతో బాణా సంచాల మధ్య ఆనందోత్సాహాలతో వినాయక నిమజ్జన కార్యక్రమంను వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు యువకులు ఉత్సాహంతో గణపతివప్పా మోరియా అంటూ వినాయక నిమజ్జనం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది మూడు రోజులపాటు విశేష పూజలు అందుకున్న విఘ్నేశ్వరుడిని నిమజ్జనం చేశారు ఈ సందర్భంగా రంగులు చల్లుకుంటూ డప్పు మోతలతో బాణాసంచా పేలుళ్లతో డీజే శబ్దాలతో ఊరేగింపుగా ప్రత్యేక సందడిగా సాగింది ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి సేవలో పాల్గొనడం సంతోషంగా ఉందని, ఆ గణనాథుని ఆశీస్సులు ప్రజలందరికీ సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని వేడుకున్నట్లు తెలిపారు.







తాళ్ళపాక శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఘనంగా మహా పూర్ణాహుతి

# భగవంతుని రూపాన్ని గుర్తు తెచ్చుకొని ఆయనను ఇలా అడగండి?

– పెన్ పవర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి




కడప పెన్ పవర్ ఆగస్టు 30 : ఒక శిష్యుడు గురువుగారిని అడిగిన ప్రశ్న.. భగవంతుడు సర్వాంతర్యామి అంటారు కదా. హృదయంలో ఉండే హరిని వెతకటానికి మనుషులు ఎంతో కష్టపడి దేవాలయాలకు వెళ్లడం దేనికి?

గురువు గారి జవాబు:

ముఖం మన దగ్గరే ఉంది. కానీ మన కంటికి మన ముఖం కనిపించదు. కనపడడానికి అద్దం లో చూసుకొంటాము, అద్దంలో ప్రాణం లేదు, కంటికి ప్రాణం ఉన్నా ప్రాణం లేని అద్దంపై ఆధారపడితేనే మన ముఖం మనకు కనిపిస్తుంది. అలాగే తెలుసుకోవాల్సిన మనం ఇక్కడే ఉన్నాం. తెలియదగిన దేవుడు ఇక్కడే ఉన్నాడు. కానీ ఆ తత్వం చూడాలంటే ఈ రెండు కాకుండా మనకి ఏదయినా ఒక అద్దం లాంటిది కావాలి, అదే విగ్రహం .... భగవంతుడు అంతటా ఉంటాడు అనుకున్నప్పుడు విగ్రహంలోనూ ఉంటాడు. అందులో భగవంతుడిని చూసే భక్తి మనకి కావాలి. మనలోన భక్తి, విగ్రహం ఈ రెండు అద్దం లాంటి ఫలితాన్నిస్తుంది. అప్పుడే భగవంతుడి సాక్షాత్కారం పొందవచ్చు....లిఅందుకే గుడికి వెళ్ళాలి. దైవదర్శనం తరువాత మన పూర్వీకులు గుడికి వెళ్లినప్పుడు దర్శనం అయ్యాక గుడి నుండి బయటకు వచ్చే ముందు కొంతసేపు గుడి మండపంలో కానీ ప్రాకారం లోపల కానీ కొంతసేపు కూర్చుని ఒక చిన్న ప్రార్ధన చేసేవారూ.

అది ఏమిటంటే..! "అనాయాసేన మరణం వినా ధైన్యేన జీవనం దేహాంతే తవ సాన్నిధ్యం దేహిమే పరమేశ్వరం." మీరు గుడి లోనికి వెళ్లినప్పుడు దేవుని ముందు నిల్చుని మీ రెండు చేతులను జోడించి, కళ్ళు తెరిచి ప్రశాంతమైన మనసుతో దర్శనం చేసుకోండి.దర్శనం అయ్యి గుడి బయటకు వచ్చాక గుడి మండపంలో కూర్చుని కళ్ళు మూసుకుని అప్పుడు మళ్లీ భగవంతుని రూపాన్ని గుర్తుకు తెచ్చుకుని ఆయనను ఈ క్రింది విధముగా అడగండి. "అనాయాసేన మరణం" నాకు నొప్పి లేక బాధ కానీ లేని మరణాన్ని ప్రసాదించు. "వినా ధైన్యేన జీవనం" నాకు ఎవరి మీదా ఆధారపడకుండా, నేను జీవితంలో ఎవరి ముందూ తలవంచకుండా, ఎవరినీ నొప్పించకుండా, నేను ఎవరి వద్దా చులకన కాకుండా ఉండే జీవితాన్ని ప్రసాదించు. "దేహాంతే తవ సాన్నిధ్యం" మృత్యువు నావద్దకు వచ్చినప్పుడు నేను నిన్ను దర్శించుకునే విధంగా దీవించు. "దేహిమే పరమేశ్వరం" ఓ ప్రభూ నాకు ఈ క్రింది మూడు వరములను ప్రసాదించమని నిన్ను ప్రార్థిస్తున్నాను.

1)అనుక్షణం నీ ప్రార్ధనలొనే గడిపే విధముగా అనుగ్రహించు.నీ ప్రార్ధనతో నన్ను ఉత్తమమైన మార్గంలోకి తీసుకు వెళ్ళు.

2)ఎప్పుడూ కూడా నేను నిన్ను నాకు కానీ నా బిడ్డలకు కానీ సంపదలు కానీ పేరు ప్రఖ్యాతులు కానీ ఇవ్వమని అడగను కానీ నాకు నీవు ఉత్తమమైన నీ సాన్నిధ్యాన్ని అనుగ్రహించు.

3) నాకు ఎప్పుడూ కూడా నీవు సదా అండగా
ఉండి నన్ను ఉత్తమమైన మార్గంలో నడిపించు.

ఇలా మీరు ఎప్పుడు గుడికి వెళ్లినా ఇప్పుడు చెప్పిన విషయాలు గుర్తుంచుకొని ప్రవర్తిస్తే మనకు ఏమి కావాలో అవి అన్ని కూడా మనం అడగకుండానే ఆయనే ప్రసాధిస్తాడని మరువకండి.

మానస సరోవరం

## నృసింహుని సేవలో ఎమ్మెల్యేలు ఇంటూరి, కాకర్ల



వలేటివారిపాలెం పెన్ పవర్ ఆగస్టు 30 : నృసింహుని సేవలో ఎమ్మెల్యేలు ఇంటూరి, కాకర్ల పవిత్ర పుణ్యక్షేత్రమైన మాలకొండ లో వెలిసియున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి వారిని శనివారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు , ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాలను ఎమ్మెల్యేలకు అందజేశారు. కందుకూరు పట్టణానికి చెందిన యాక్సిస్ బ్యాంక్ వారు నూతన కంప్యూటర్ ను ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు కాకర్ల సురేష్ చేతుల మీదగా ఆలయ అధికారులకు అందజేశారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే లు ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్ లకు ఆలయ పండితులు, అధికారులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో చంద్రశేఖర్, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, కాకుమాని హర్ష మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## కురసాల సత్యనారాయణకు ఘన నివాళి

నివాళులు అర్పించిన మండల వైసీపీ నేతలు



**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 30 :** ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్ఆర్సిపి రీజనల్ కోఆర్డినేటర్ మాజీ మంత్రి కురసాల కన్నబాబు తండ్రి కురసాల సత్యనారాయణకి ఘన నివాళులు అర్పించిన కొయ్యూరు మండల వైసీపీ నేతలు. శనివారం మండలంలోని వైసీపీ నేతలు కురసాల సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్ బాబు, జడ్పిటిసి వార నూకరాజు, వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలమ్మ, జల్లి బాబులు, గాడి సత్యనారాయణ, జైతిరాజులమ్మ, ధోని బాబ్జి వనం బాబు,సర్పంచులు ఎంపీటీసీలు నత్తూరు సోమన్న దొర, పొట్టిక శ్రీను, రీమల శ్రీనివాస్,జంపా రాజకుమారి, పొడుగు రత్నం,నేమాని నూకాలమ్మ, గంగాభవాని, గాడిఅచ్చిరాజు,తదితరులు పాల్గొని నివాళు లర్పించారు.

## విధి నిర్వహణ లోనరసింహారావు ఫర్ఫెక్ట్...!

- ఉద్యోగ విరమణ పొందిన మర్రివాడ హెచ్ఎంకు ఘన సన్మానం



**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు30:** విధి నిర్వహణలో ఆయన పర్ఫెక్ట్, అందరి దృష్టిలో ఆయన కరెక్ట్' అంటూ ఉద్యోగ విరమణ పొందిన మండలంలోని మర్రివాడ ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు బిజే నరసింహారావును ఉద్దేశించి ఎంఈఓలు రాంబాబు, ప్రసాద్, సర్పంచ్ మాదల సత్యవతి, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, పిఆర్టియు నేత వేంపాటి తలుపులు, ఏపీటీఎఫ్ నేత రఘువరన్, ఉపాధ్యాయ సంఘ నేతలు ఆర్. నాగేశ్వరరావు, భరత్, కుంచె మురళి, రమణ, బడుగు రామకృష్ణ, ఫణీంద్ర, వై సింహాచలం, అచ్చిరాజు, లకె సురేష్ తదితరులు కొనియాడారు. శనివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించిన ఈ ఉద్యోగ విరమణ సన్మానకార్యక్రమంలో సన్మాన గ్రహీత నరసింహారావు మాట్లాడుతూ– తనను ఆదరించిన, అభిమానించిన అధికారులను, స్థానిక ప్రజాప్రతినిధులను, తోటి ఉపాధ్యాయులను ఎప్పటికీ మరువలేను అన్నారు. కాగా వక్తలు మాట్లాడుతూ – సన్మాన గ్రహీత నరసింహారావు తన శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో, కుటుంబీకులతో హాయిగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 13 వ వార్డులో ఘనంగా అన్నసమారాధన

- పాల్గొన్న కార్పొరేటర్ కెల్లా సునీత సత్య నారాయణ



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం ఆగస్టు 30:** గణపతి ఉత్సవాల్లో భాగంగా జివిఎంసి పదమూడవ వార్డు పరిధి పాండురంగపురం, వెర్నిదుర్గ నగర్ స్థానిక సంఘ సభ్యులు ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం నాడు కమిటీ సభ్యులు పలు ప్రాంతాలలో నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమాలలో ముఖ్య అతిధిగా కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ. పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ అన్న సమారాధన కార్యక్రమంలో సమీప ప్రాంత ప్రజలు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.బాలరాజు, వడిసెల శ్రీను,మాధవ్ సాహు తదితరులు పాల్గొన్నారు.

## కొయ్యూరు నూతన సీఐగా శ్రీనివాస్



**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 30:**ప్రస్తుతం విజయనగరం సైబర్ క్రైమ్ సెల్ సీఐగా పనిచేస్తున్న శ్రీనివాస్ కొయ్యూరు నూతన సీఐ గా బదిలీ అయ్యారు. ప్రస్తుతం కొయ్యూరు సీఐగా పనిచేస్తున్న పి. వెంకటరమణ అల్లూరి సీతారామ రాజు జిల్లా సోషల్ మీడియా సైబర్ సెల్ కు బదిలీ కావడంతో శ్రీనివాస్ నూతల సీఐగా నియమితులయ్యారు. కాగా శ్రీనివాస్ గతంలో కొయ్యూరు ట్రైనీ ఎస్ఐ గా పనిచేసి, అటుపై 2008 సం. నుండి 2010 సం. వరకు కొయ్యూరు ఎస్సైగా పనిచేశారు. కాగా నూతన సీఐ గా శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

# హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక ర్యాలీ.

- ఆదివాసి గిరిజన సంఘం హుకుంపేట మండల కమిటి
- మజ్జివలసలో గ్రామసబ
- నిర్వహిస్తే అడ్డుకునే తీరుతాం.



**పెన్ పవర్ హుకుంపేట ఆగస్టు 30.**హుకుంపేట మండలం బూర్జ పంచాయతీలో నవయుగ కంపెనీ కోసం భుర్జ పంచాయతీ సర్వం జలసమాధి చెయ్యద్దనీ హుకుంపేట మండలం ప్రధాన రోడ్డులో భారీ ర్యాలి నిర్వహించారు.

నవయుగ ప్రైవేటు కంపెనీలకు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణనికి సర్వేలు రాళ్ళు నిర్మిస్తున్న వారిపై కేసులు పెట్టలి అంటూ నినాదాలు చేశారు

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణనికి ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భుర్జ పంచాయతీ ఆదివాసీ ప్రజలు హుకుంపేట మండలం కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

రాష్ట్ర ప్రభుత్వం భుర్జ పంచాయతీ మజ్జి వలస గ్రామంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణనికి ఆగస్టు 28 తేదీన గ్రామ సభ ఏర్పాటు చెయ్యాలనీ నోటీస్ జారీ చేశారు. భుర్జ పంచాయతీలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణము జరిగితే 14 గ్రామంలో 5 వేల మంది ఆదివాసులు జలసమాధి అవుతున్నారనీ ఆగ్రహంతో పంచాయతీకి చెందిన వందలాది మంది ఆదివాసులు గ్రామసభలో హాజరయ్యారు

వందలాది మంది ఆదివాసులు ఆగ్రహాన్ని ప్రభుత్వం గమనించి మజ్జి వలసలో జరగవలసిన గ్రామ సభ తాత్కాలికంగా వాయిదా వేశారు మజ్జి వలసలో గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు తక్షణమే ఆపాలని పంచాయతీ ప్రజలందరూ పాడేరులో అడిషనల్ ఎస్ పి శ్రీ నీరజ్ ఐపీఎస్ తో జరిగిన సమావేశంలో పాల్గొనారు ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లోసురేంద్ర,అనంత గిరి జెడ్పీటీసీ సభ్యులు డి.గంగరాజు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పీ.బలదేవ్ నాయకత్వంలో జరిగిన సమావేశంలో పిర్యాదు చేసారు భుర్జ పంచాయతీలో 14 గ్రామ పరిధిలోని 5 వేల మంది ఆదివాసులు జలసమాధి చేస్తున్న హైడ్రోపవర్ ప్రాజెక్ట్ నిర్మాణనికి ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని ఆదివాసీల హక్కులు,చట్టాలు కాపాడాలని శ్రీ నీరజ్ ఐపీఎస్ దృష్టికి తీసుకుని వెళ్ళారు

భుర్జ పంచాయతీలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణనికి నిర్మిస్తున్న సర్వే రాళ్ళు పగలుగొట్టాలని ఆదివాసులకు పిలుపిచ్చారు

ఆదివాసీలకు 5 వ షెడ్యూల్ ప్రాంతంలో రాజ్యాంగ హక్కులైన పీసా చట్టం, అటవి హక్కుల,1/70 చట్టన్నీ ఉల్లంఘించి ప్రైవేట్ సంస్థలకు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణనికి వేల ఎకరాల అటవి, జీరయితి భూములు కేటాయించడాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు

అనంతగిరి మండలంలో పెదకోట, గుజ్జెలి, చిట్టంపాడు ప్రాంతంలో నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జివో 51 రద్దు చేయాలని డిమాండ్ చేశారు

అదానీ,నవయుగ సంస్థకు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణనికి అనుమతులు ఇచ్చి గుట్టు చప్పుడు లేకుండా గ్రామంలో సర్వేలు, ముమ్మరం చేసింది మార్కింగ్ రాళ్ళు నిర్మిస్తున్నది తక్షణమే సర్వేలు,మార్కింగ్ రాళ్ళు నిర్మినాలు ఆపాలని డిమాండ్ చేశారు

హుకుంపేటలో జరిగిన భారీ ర్యాలీ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం హుకుంపేట మండల కమిటి కార్యదర్శి టీ.కృష్ణారావు హైడ్రో.పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాటకమిటి కన్వీనర్ మజ్జి సురేష్. భుర్జ ఎంపీటీసీ మజ్జి హరి పోరాటకమిటి సభ్యులు మజ్జి కృష్ణ మూర్తి హుకుంపేట మండల సిపిఎం పార్టీ కార్యదర్శి వి.లక్మన్, గిరిజన సంఘం మండల నాయకులు కె.రామారావు తదితరులు పాల్గొన్నారు

## సీ ఫుడ్ ఎగుమతిదారులతో కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్





**కార్యదర్శి అవినాష్ జోషి సమావేశం**

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, ఆగస్టు 30** :కలెక్టర్ కార్యాలయంలో కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ కార్యదర్శి అవినాష్ జోషి ఆధ్వర్యం లో శనివారం సీ ఫుడ్ ఎగుమతిదారులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో స్ప్రింట్ సంస్థకు చెందిన పవన్ కుమార్, దేవి సీ ఫుడ్స్ ప్రతినిధి జి.ఎస్.రావు, అవంతి సీ ఫుడ్స్ నుంచి సత్యనారాయణ తదితరులు ఎగుమతుల విష యంలో ఎదురవుతున్న సమస్యలను వివరిం చి, ప్రభుత్వ సహకారం కోరారు. సమస్యలను చర్చించి తగు చర్యలు తీసుకుంటామని అవినా ష్ జోషి హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సెక్రటరీ చిరంజీవి చౌదరి మాట్లా డుతూ, స్థానిక స్థాయిలో కూడా సీ ఫుడ్ విని యోగాన్ని పెంచేందుకు ఎగుమతిదారులు ముందుకు రావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ కమిషనర్ రామ్ శంకర్ నాయక్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జేడీ ఫిషరీస్ పి.లక్ష్మణరావు, ఎంపెడా జేడీ విజయ్‌కుమార్, డీడీ అందర్ ఆలీ, డీడీ ఏపీఎంఐపీ మన్మధరావు, ఎంపెడా అధికారులు, పలువురు సీ ఫుడ్ ఎగుమతిదారులు పాల్గొన్నారు.

## పద్మనాభంలో స్మార్ట్ కార్డుల పంపిణీ



**పద్మనాభం, పెన్ పవర్, ఆగస్టు 30** :పద్మనాభం మండలం తహశీల్దార్ కే. ఆనంద్ రావు ఆధ్వర్యంలో డిపో నెం.11 వద్ద స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభు త్వ పథకాల సద్వినియోగం జరిగేలా తహశీ ల్దార్ కార్యాలయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. రైతులకు, పేదలకు సమయానికి సేవలు అందించడమే తన ప్రధాన ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో వీ.ఆర్వో అప్పలరాజు, సంబం ధిత సిబ్బంది పాల్గొని లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. స్థానిక ప్రజలు తహశీల్దార్ సేవలను అభినందించారు.

## హుకుంపేట వారపు సంతలో విస్తృతంగా వాహన తనిఖీలు



**పెన్ పవర్ హుకుంపేట ఆగస్టు 30**

అల్లూరి జిల్లా హుకుంపేట మండల కేంద్రం స్థానిక కామయ్యపేట జంక్షన్ వద్ద సిఐ సన్యాసినాయుడు ఆదేశాల మేరకు ఎస్సై సూర్యనారాయణ విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఒరిస్సా సరిహద్దు నుండి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేయడమే కాకుండా వాహనాలకు సంబంధించి పత్రాలు లేని వాహనాలను గుర్తించి పలు కేసులు నమోదు చేశారు.అలాగే ప్రమాద నివారణలు, మత్తు పదార్థాల వలన కలిగే నష్టాలపై ప్రధాన కూడలి వద్ద అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాల జోలికి పోయి నేరస్తులు కావద్దని ముఖ్యంగా అసాంఘిక శక్తులకు సహకరించవద్దన్నారు. అలాగే సారా తయారీ విక్రయాలు గంజాయి సాగు రవాణా వలన కలిగే నష్టాలు గురించి వివరించారు. ప్రతి వాహన చోదకుడు తప్పకుండా లైసెన్స్ కలిగి ఉండాలని అలాగే మీ వాహనాలు మీ పేర్ల మీద ఉండాలని లేనియెడల ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుంది. కనుక ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలు పాటించాలని తెలిపారు.

## చింతపల్లి శాసనసభ నియోజకవర్గం కేంద్రంగా ప్రకటించాలి

**మన్యపుత్ర యువజన సంఘం అధ్యక్షులు ఎం.సోమేశ్ కుమార్**



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 30:** చింతపల్లి శాసనసభ నియోజకవర్గాన్ని తిరిగి పునరుద్ధరించాలని, ఆ ప్రాంత అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వాన్ని అనుకూల నిర్ణయం తీసుకోవాలని రింతాడ ఉప సర్పంచ్, “మన్యపుత్ర యువజన సంఘం” అధ్యక్షుడు సోమేశ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.చింతపల్లి శాసనసభ నియోజకవర్గం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చారిత్రకంగా కీలకమైన ప్రాంతంగా ఉన్నా, 2008లో డీలిమిటేషన్ కమిషన్ సిఫారసుల ఆధారంగా ఈ నియోజకవర్గాన్ని రద్దు చేయబడింది. ఈ ప్రాంతం పూర్వం చింతపల్లి, జీకే వీధి కొయ్యూరు, గోలుగొండ మండలాలను కలిపి ఏర్పడిన ప్రాంతం. ఈ నియోజకవర్గం రద్దయిన తర్వాత, 2009 నుండి పాడేరు నియోజకవర్గం పరిధిలో భాగంగా ఉంది. భారతదేశంలో స్వాతంత్ర్య పోరాటంలో భాగమైన అల్లూరి సీతారామరాజు ఆధ్వర్యంలో చింతపల్లి ఒక ప్రముఖ పోరాట కేంద్రంగా నిలిచింది. బ్రిటిష్ పాలనలో కూడా చింతపల్లి రెవెన్యూ తాలూకాగా ఉండేది. చింతపల్లి శాసనసభ నియోజకవర్గాన్ని పునరుద్ధరించడం ద్వారా ఆ ప్రాంతం మరింత అభివృద్ధి చెందడమే కాక, ప్రజల సమర్థన కూడా పొందుతుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా కొత్త ప్రతిపాదికగా ఏర్పడిన ప్రాంతాల్లో పాడేరు, అరకు, జి మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాలుగా ప్రస్తుత సమీకరణం సరైనదో లేదో ప్రభుత్వం ఆలోచించాలి.”ఇది వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పట్ల దృష్టి పెట్టి, ప్రజల అవసరాలను పరిగణలోకి తీసుకుని, చింతపల్లి ప్రాంతం ప్రజల కోరికను తీర్చే దిశగా ఇది అద్భుతమైన అవకాశమవుతుంది” అని ఆయన అన్నారు.పార్టీలను అతీతంగా, పాత నియోజకవర్గ కేంద్రం అయిన చింతపల్లి ప్రాంతాన్ని తిరిగి శాసనసభ కేంద్రంగా మార్చాలని ఆయనే విజ్ఞప్తి చేశారు.

## జి.మాడుగుల గ్రామంలో భారీ అన్న సమారాధన



**పెన్ పవర్: జి.మాడుగుల:ఆగస్టు (30)** శ్రీ వరసిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో ఈరోజు జి మాడుగుల గ్రామంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చుట్టుపక్కల గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపించిన ముర్రు శ్రీను యువకులు వరుణ్ శ్రీను వెంకటేష్ వినోద్ ప్రసాద్ సంతోష్ బ్రహ్మాజీ సత్తిబాబు ఠాగూర్ గణేష్ పాల్గొని ఈ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకున్నారు.

# తెలంగాణ అసెంబ్లీ.. - ఫస్ట్ డే - ఏం చేశారంటే!



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు.. శనివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు సహజంగానే ఏ సభ అయినా.. ప్రశాంత వాతావరణంలో ప్రారంభమవుతుంది. అలానే తెలంగాణ అసెంబ్లీ కూడా ప్రశాంతంగా ప్రారంభమైంది. కానీ, సభలో ప్రధానప్రతిపక్షం బీఆర్ఎస్ పక్షం ఆలస్యంగా వచ్చింది. వచ్చిన తర్వాత.. రైతుల సమస్యలపై చర్చకు తీర్మానం ఇచ్చారు. కానీ, తొలిరోజు పలు విషయాలు ఉన్నాయని.. ముందు వాటిని తీసుకుంటామని స్పీకర్ ప్రసాదరావు స్పష్టం చేశారు. దీంతో బీఆర్ఎస్ సభ్యులు తమ తమ స్థానాల్లో నిలబడి నిరసన వ్యక్తం చేశారు.మరోవైపు.. తొలిరోజు అసెంబ్లీలో మూడు మాసాల కిందట అనారోగ్యంతో మృతి చెందిన జూబ్లీహిల్స్ బీఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు సంతాపం ప్రకటించారు. దీనిపై మంత్రులు సంతాప తీర్మానం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా ఈ తీర్మానం ప్రవేశ పెట్టామని.. మంచి నేత విషయంలో చర్చించేందుకు తమకు భేషజాలు లేవన్నారు. తనకు మాగంటితో అనేక విషయాల్లో సంబంధ బాంధవ్యాలు ఉన్నాయని చెప్పారు. ఆయన మంచి నాయకుడిగా ప్రజల గుర్తింపు సాధించారని తెలిపారు. టీడీపీలో ఉన్నప్పుడు ఇరువురు.. చేసిన పనులను ఈ సందర్భంగా సీఎం చెప్పారు. విద్యార్థి స్థాయిలోనే మాగంటి రాజకీయాల్లోకి వచ్చారని, ఆయన అనేక రంగాల్లో తన ప్రతిభను చాటుకున్నారని తెలిపారు. విద్యార్థి నేతగా , ప్రజాప్రతినిధిగా, సినీ నిర్మాతగా రాణించారన్నారు. అనంతరం... పలువురు మంత్రులు కూడా సంతాప తీర్మానంపై ప్రసంగించారు.

**మండలిలో..**

శాసన మండలి సమావేశాలు కూడా శనివారమే ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కొత్తగా మండలిలో ప్రవేశించిన వారికి రాజ్యాంగ ప్రతులు అందించారు. అనంతరం వారిని సభకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమం తర్వాత.. మండలిలోనూ.. సంతాప తీర్మానాలు ప్రవేశ పెట్టారు. మాజీ ఎమ్మెల్సీలు రత్నాకర్, రంగారెడ్డి మృతిపట్ల సభ్యులు తమతమ భావాలను వ్యక్తం చేశారు.

**సోమవారానికి వాయిదా..**

ఈ సంతాప తీర్మానాల అనంతరం.. ఉభయ సభలు సోమవారానికి వాయిదా పడనున్నాయి. అయితే.. శనివారం మధ్యాహ్నం బిజినెస్ అడ్వయిజరీ కమిటీ(బీఏసీ) భేటీ అయి సభలను ఎన్ని రోజులు నిర్వహించాలనే విషయంపై చర్చించనున్నాయి. దాని ప్రకారమే.. సోమవారం నుంచి సభలు జరగనున్నాయి.

# జగన్ ఫుల్ సేఫ్.. రీజన్ ఇదే... !



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ అధినేత జగన్ సేఫ్ గా ఉన్నారా? ఆయనపై ఈగ వాలే అవకాశం కూడా లేదా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన మూడు అంశాలను తీసుకుని విచారణ జరిపిస్తోంది. వీటిల్లో ప్రధానంగా వైసిపి హయాంలో జరిగిన మధ్య కుంభకోణం లో అనేక మందిని అరెస్ట్ చేశారు. ఇంకా దీని విచారణ కొనసాగుతోంది. ఇప్పటివరకు దాఖలు చేసిన రెండు చార్జ్ షీట్లలో కూడా జగన్ పేరును అధికారులు ప్రస్తావించారు. అయితే, అనూహ్యంగా ఉపరాష్ట్రపతి ఎన్నికల వ్యవహారం తెర మీదకు వచ్చిన తర్వాత ఈ విచారణ మందగించింది.దీని వెనక బిజెపి పెద్దల వ్యూహముందుని, బిజెపి వైపు నుంచి ఒత్తిడి పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసు విషయంలో నెమ్మదించింది అన్న ప్రచారం జరుగుతోంది. ఇక రెండోది.. ముఖ్యంగా రాష్ట్రాన్ని కుదిపేసిన వ్యవహారం వివేకానంద రెడ్డి దారుణ హత్య కేసు. ఈ విషయంలో కూడా జగన్ సేఫ్ అయిపోతున్నారు అన్న ప్రచారం జరుగుతోంది. కేంద్రంలోని పెద్దలు వైసిపి తో టచ్ లో ఉండడం, వైసిపి నేతలకు పుట్టినరోజు శుభాకాంక్షలు, పెళ్లిరోజు శుభాకాంక్షలు చెబుతూ ఉండడం ప్రతి చిన్న విషయానికి వైసీపీ నాయకులను పొగడ్డం వంటివి ఆసక్తిగా మారింది.

దీంతో ఈ కేసులో కీలక ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకులు సైతం ఆనందంగా ఉన్నారు. అదే విధంగా జగన్ అయితే అసలు ఈ విషయాన్ని పట్టించుకోనట్టే వ్యవహరిస్తున్నారు. దీన్నిబట్టి బిజెపి నుంచి ఏ తరహా సహకారం లభిస్తుంది? అన్నది స్పష్టమవుతోందని రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది. ఇక మూడో అంశం వైసిపి హయాంలో జరిగిన జగనన్న ఇళ్ల కార్యక్రమం. దీనిలో కూడా అవకతవకలు జరిగాయని భారీ ఎత్తున వైసిపి నాయకులు ప్రభుత్వ సొమ్మును కాజేశారు అన్న విమర్శలు ఉన్నాయి. దీనిపై కూడా విచారణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నేల కిందట నిర్ణయించుకుంది.

ఎక్కడెక్కడ అవకతవకలు జరిగాయో.. ఎక్కడెక్కడ విమర్శలు వచ్చాయో.. ఆయా ప్రాంతాల్లోని జగనన్న కాలనీలపై విచారణ చేపట్టి తక్షణం చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు కూడా భావించారు. అయితే అనూహ్యంగా ఇది కూడా తెరచాటుకు వెళ్లిపోయింది. దీని వెనుక కూడా బిజెపి పెద్దలకు వ్యూహం అన్నది టిడిపి నేతల మధ్య జరుగుతున్న చర్చ. ఇలా ప్రతి విషయంలోనూ ఇక జగన్ జోలికి రాష్ట్ర ప్రభుత్వం వెళ్లే అవకాశం ఉండకపోవచ్చు అని తెలుస్తోంది. అయితే రాజకీయంగా మాత్రం విమర్శలు ప్రతి విమర్శలు కామనే.ఖకానీ, భారీ స్థాయిలో చర్యలు తీసుకునే లాగా చట్టం ముందు నిలబెట్టేలాగా ఇకపై పరిస్థితులు ఉండకపోవచ్చు అని అంటున్నారు. ప్రధానంగా ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో వైసీపీ బీజేపీ వైపు మొగ్గు చూపడం, కాంగ్రెస్ వైపు నుంచి ఒత్తిళ్లు వచ్చినప్పటికీ వైసీపీ చలించకుండా బిజెపి కోసమే నిలబడినట్టుగా సంకేతాలు పంపించిన నేపద్యంలో పూర్తిస్థాయిలో జగన్‌కు రక్షణ కల్పించే దిశగా బిజెపి పెద్దలు వ్యూహాత్మకంగా పావులు కలిపినట్టు సమాచారం. మరి ఇది ఏమేరకు ఫలిస్తుందో చూడాలి.

# అమెరికా వాణిజ్య యుద్ధానికి భారత్ కౌంటర్ ప్లాన్



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా ఇటీవలి కాలంలో భారత్‌పై విధించిన 50% దిగుమతి సుంకం కేవలం ఒక వాణిజ్య చర్య మాత్రమే కాదు.. అది ఆర్థిక, రాజకీయ, వ్యూహాత్మక అంశాల సమ్మేళనం. ఈ చర్య వెనుక ఉన్న లోతైన కారణాలు, దాని ప్రభావాలు.. భారత్ తీసుకోగల చర్యలు ఇప్పుడు ఆసక్తి రేపుతున్నాయి.

**అమెరికా వాణిజ్య దాడి వెనుక కారణాలు**

అమెరికా ప్రభుత్వం ఈ భారీ సుంకాన్ని విధించడానికి ప్రధానంగా నాలుగు ముఖ్య కారణాలను చూపుతోంది.

వాణిజ్య లోటు : అమెరికాకు భారత్‌తో ఉన్న వాణిజ్య లోటు చాలా కాలంగా ఒక ప్రధాన సమస్యగా ఉంది. అమెరికా అభిప్రాయం ప్రకారం.. భారతదేశం అమెరికన్ ఉత్పత్తులైన వ్యవసాయ వస్తువులు, వైద్య పరికరాలు.. టెక్ ఉత్పత్తులపై అధిక సుంకాలు విధిస్తోంది. అదే సమయంలో అమెరికా భారతీయ ఉత్పత్తులపై తక్కువ సుంకాలు వసూలు చేస్తోంది. ఈ అసమానతను తగ్గించడానికే ఈ 50% సుంకం విధించబడింది. అమెరికా ఫస్ట్ నినాదాన్ని బలంగా వినిపించడం కూడా దీని వెనుక ఉన్న లక్ష్యం.

దేశీయ పరిశ్రమల రక్షణ: చైనా, జర్మనీ వంటి దేశాల నుంచి దిగుమతులు పెరిగి తమ దేశీయ పరిశ్రమలకు నష్టం జరుగుతుందని అమెరికా భావిస్తోంది. అదే విధంగా స్టీల్, అల్యూమినియం, టెక్స్‌టైల్ , ఎలక్ట్రానిక్స్ వంటి రంగాలలో భారత్ ఎగుమతులు కూడా అమెరికన్ పరిశ్రమలకు ముప్పుగా పరిణమించవచ్చని వాషింగ్టన్ అంచనా వేసింది. అందువల్ల తమ దేశీయ తయారీదారులను కాపాడటానికి ఈ రక్షణాత్మక చర్య తీసుకుంది.

**రాజకీయ లెక్కలు:** ఎన్నికల వేళ ట్రంప్ అమెరికా ఫస్ట్ అని హామీ ఇచ్చి గెలిచారు. అదే అమలు చేస్తున్నారు. తమ దేశ ఆర్థిక ప్రయోజనాలను కాపాడటంలో తమ ప్రభుత్వం ఎంత నిబద్ధతతో ఉందో ఓటర్లకు చూపించడానికి "అమెరికా ఫస్ట్" నినాదాన్ని టారిఫ్‌ల ద్వారా బలపరిచే ప్రయత్నం జరుగుతోంది. ఇది దేశీయ ఓటర్లను ఆకట్టుకోవడానికి ఒక వ్యూహాత్మక అస్త్రంగా పనిచేస్తుంది.

**భూదౌత్య ఒత్తిడి :** వాణిజ్య సుంకాలు కేవలం ఆర్థిక అంశాలే కాకుండా వ్యూహాత్మక సాధనాలు కూడా. అమెరికా భారత్‌ను రష్యాపై ఉన్న ఆయుధ , చమురు ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని కోరుతోంది. అలాగే ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అమెరికా వ్యూహానికి మరింత మద్దతు ఇవ్వాలని ఆశిస్తోంది. సుంకాలు విధించడం ద్వారా ఈ కీలక అంశాలపై చర్చల కోసం భారత్‌ను దౌత్యపరంగా ఒత్తిడిలోకి తీసుకురావాలని అమెరికా భావించింది.

**భారత్‌పై ప్రభావం**

అమెరికా చర్య భారత ఆర్థిక వ్యవస్థపై అనేక విధాలుగా ప్రభావం చూపుతుంది. ఎగుమతుల నష్టం వాటిల్లుతోంది. 50% సుంకం కారణంగా అమెరికాకు భారత ఎగుమతులు తీవ్రంగా దెబ్బతింటాయి. ముఖ్యంగా టెక్స్‌టైల్స్, జౌళి, చేతిపనులు, రత్నాలు , ఆభరణాలయ, ఆటో విడిభాగాలు వంటి రంగాల నుండి బిలియన్ల డాలర్ల ఎగుమతి ఆదాయం కోల్పోయే ప్రమాదం ఉంది. రూపాయిపై ఒత్తిడి పడుతోంది. ఎగుమతులు తగ్గడం వల్ల విదేశీ మారక ద్రవ్యం (ముఖ్యంగా డాలర్లు) ప్రవాహం తగ్గుతుంది. ఇది భారత రూపాయి విలువపై ఒత్తిడిని పెంచుతుంది, తద్వారా దిగుమతులు ఖరీదైనవిగా మారతాయి. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సంక్షోభం తలెత్తనుంది. అమెరికా మార్కెట్‌పై ఎక్కువగా ఆధారపడిన చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయి. ఈ రంగాలలో వేల సంఖ్యలో ఉద్యోగాలు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. ఈ పరిస్థితిని భారత ప్రభుత్వం ఎలా ఎదుర్కొంటుందనేది ఒక పెద్ద సవాలు. ప్రతిగా ప్రతీకార సుంకాలు విధించాలా, లేదా దౌత్యపరమైన చర్చల ద్వారా పరిష్కారాన్ని అన్వేషించాలా అనే సందిగ్ధత ఎదురవుతుంది.

**ప్రపంచవ్యాప్త ప్రభావం- భారత్ సాధ్యమైన చర్యలు**

ఈ వాణిజ్య యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతుంది. ఇది ప్రపంచ వాణిజ్య సంస్థ (%డబ్ల్యూ%)లో వివాదాలకు దారితీస్తుంది. గ్లోబల్ సప్లై చైన్‌లపై ఆధారపడిన బహుళజాతి కంపెనీలు తమ వ్యూహాలను మార్చుకునే అవకాశం ఉంది. ఈ పరిస్థితులకు భారత్ మూడు రకాలుగా స్పందించవచ్చుప్రతీకార సుంకాలు విధించాలి. అమెరికా నుండి దిగుమతి అయ్యే బాదం, యాపిల్, హార్లే డేవిడ్‌సన్ బైక్‌లు వంటి ఉత్పత్తులపై సుంకాలు పెంచడం. ఇది అమెరికాపై కూడా ఆర్థిక ఒత్తిడిని పెంచుతుంది. అమెరికాతో దౌత్యపరమైన చర్చలు జరిపి, సుంకాలు తగ్గించడానికి లేదా ఉపసంహరించుకోవడానికి ప్రయత్నించాలి. మార్కెట్ వైవిధ్యం కేవలం అమెరికాపై ఆధారపడకుండా, దక్షిణాసియా, ఆఫ్రికా, యూరప్ వంటి ఇతర ప్రాంతాలలో కొత్త మార్కెట్లను అన్వేషించి, ఎగుమతులను పెంచుకోవడం. దేశీయ పరిశ్రమలను బలోపేతం చేయడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌ల ఒత్తిడిని తట్టుకునేలా చేయడం.

ఈ వివాదం కేవలం ఆర్థిక సమస్య కాకుండా, రెండు దేశాల మధ్య ఉన్న రాజకీయ-వ్యూహాత్మక సంబంధాల ప్రతిబింబం. దీర్ఘకాలంలో ఇది పరిష్కారం కాకపోతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కూడా సవాళ్లను సృష్టించవచ్చు.

# ఆపరేషన్ సింధూర్ లో ఉపయోగించిన ఆయుధాలు ఇవే... ఐఏఎఫ్ అధికారి నర్మదేశ్వర్ తివారీ



**హైదరాబాద్ పెన్ పవర్:** పహాల్గమ్‌ఉగ్రదాడికి భారత వైమానిక దళం ప్రతిస్పందనగా చేపట్టిన ఆపరేషన్ సింధూర్ భారత సైన్యానికీ, అంతర్జాతీయ సమాజానికీ ఒక కీలక పరిణామంగా నిలిచింది. ఈ ఆపరేషన్‌లో 50 కంటే తక్కువ ఆయుధాలను ఉపయోగించి, పాక్ ఆక్రమిత కశ్మీర్, పాకిస్థాన్ లోని కీలక లక్ష్యాలను ఛేదించడం వైమానిక దళం యొక్క అత్యున్నత శక్తిని ప్రతిబింబించింది. ఎయిర్ మార్షల్ నర్మదేశ్వర్ తివారీ తెలిపిన వివరాలు, ఈ వ్యూహం యొక్క వివిధ కోణాలను బాగా అర్థం చేసుకునే అవకాశం ఇస్తున్నాయి.

**ఆపరేషన్ సింధూర్ వ్యూహాత్మక విజయం**

ఆపరేషన్ సింధూర్‌లో భారత వైమానిక దళం వినియోగించిన వ్యూహం సమర్థవంతంగా అమలు చేయబడింది. "యుద్ధం ప్రారంభించడం సులభం, కానీ దాన్ని ముగించడం చాలా కష్టం" అన్న మాటలు ఎయిర్ మార్షల్ తివారీ వ్యూహాత్మకతను స్పష్టం చేస్తున్నాయి. ప్రతి దాడి, ప్రతి సమయం, ప్రతి లక్ష్యం ఖచ్చితంగా ప్రణాళిక ప్రకారం ఏర్పడినవే. 50 ఆయుధాల ద్వారా వేగవంతంగా చేసిన మిసైల్ దాడులు, పాక్ సేనను సీజ్‌ఫైర్‌కు ఒప్పించే విధంగా ప్రభావం చూపించాయి.

**"ప్రతీకారం, సమయం... వ్యూహాత్మక దృష్టి"**

పహాల్గమ్ లో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకోవడం కోసం భారత సైన్యం వివిధ లక్ష్యాలను శ్రద్ధగా ఎంచుకుంది. ఏప్రిల్ 22న జరిగిన దుర్ఘటనకు వెంటనే ప్రతిస్పందనగా, 29 నాటికి మే 5న ఆపరేషన్ ప్రారంభించడానికి ప్రణాళిక రూపొందించారు. ఈ ప్రక్రియను అమలు చేయడం ద్వారా, భారత వైమానిక దళం అవసరమైన సమయాన్ని, స్థలాన్ని, లక్ష్యాన్ని ఖచ్చితంగా నిర్ణయించి, ఆపరేషన్‌ను విజయవంతం చేసింది.

**పాకిస్థాన్ సీజ్‌ఫైర్: అంతర్జాతీయ ప్రభావం**

మిసైల్ దాడులు, లక్ష్యాలను ఛేదించడం, భారత వైమానిక దళం యొక్క కచ్చితత్వాన్ని ప్రపంచానికి తెలియజేశాయి. భారత సైన్యం 50 ఆయుధాలతో పాక్ కు భారీ నష్టం కలిగించి, 10 మే నాటికి పాక్ సీజ్‌ఫైర్‌కు దిగింది. ఈ పరిణామం, పాకిస్థాన్ యొక్క సరిహద్దు నిర్ణయాలపై ఆలోచించాల్సిన సమయాన్ని కలిగించింది. ప్రపంచం భారత సైన్యం యొక్క సమర్థతను, వ్యూహాన్ని పరిగణలోకి తీసుకుని దీనిని ఒక గమనార్హ విజయంగా చూశింది.

**భారత సైన్యం శక్తి.. సమర్థత**

ఆపరేషన్ సింధూర్‌లో భారత సైన్యం చూపిన శక్తి, వ్యూహాత్మక దృష్టి, నిపుణత అంతర్జాతీయ యుద్ధవేదికలలో భారత సైన్యం తన పై ఉన్న వృద్ధి మరియు సమర్థతను చెప్తున్నాయి. 50 ఆయుధాలతో, పాక్ గడ్డపై సరిహద్దు వద్ద కచ్చితమైన లక్ష్యాలను ఛేదించడం, భారత సైన్యం యొక్క గమ్యాన్ని సాధించడంలో ఉన్న ప్రావీణ్యతను మనకు చూపించింది. ఈ ఆపరేషన్ ద్వారా భారత సైన్యం తన వైమానిక శక్తిని, వ్యూహాత్మక మేధస్సును, అనుకూలతను సమర్థంగా చాటుకుంది. ప్రపంచం ఈ విజయాన్ని మనకోసం గౌరవంగా చూస్తూ, తగిన ప్రతిపాదనలు చర్చిస్తోంది.

# మాధవ్ సైలెంట్ వార్.. నేతలకు గీతోపదేశం.. !



**హైదరాబాద్ పెన్ పవర్:** బీజేపీ ఏపీ చీఫ్ పీవీఎన్ మాధవ్.. సైలెంట్ వార్ ప్రారంభించారా? .. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు.. పార్టీని విస్తృత పరిచే ప్రణాళికలను ఆయన అమలు చేయాలని భావిస్తున్నారా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. తాజాగా ఆయన చెబుతున్న మాటలను బట్టి.. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు .. పార్టీ నగరాలకు.. కొన్ని మండలాలకు మాత్రమే పరిమితమైంది.ఈ విషయంలో ఎలాంటి సందేహం లేదు. కానీ, ఇప్పుడు గ్రామీణ, మండల స్థాయిలోనూ పార్టీని పుంజుకునేలా చేయాలన్నది మాధవ్ నిర్ణయం. తాజాగా ఆయన ఇదే విషయాన్ని పార్టీ నాయకులకు దిశానిర్దేశం ఖచేశారు. "వచ్చే ఎన్నికల నాటికి పరిణామాలు ఎలాగైనా మారొచ్చు. మన కాళ్లపై మనం నిలబడాలి. అప్పటి వరకు ఎవరికి వారు పోరాటం చేయాల్సిందే. గ్రామీణ స్థాయిలో పార్టీని పుంజుకునేలా చేయాలి. ఈ విషయంలో అందరూ ఒక లక్ష్యం పెట్టుకుని పనిచే యాలి." అని నేతలకు గీతోపదేశం చేశారు. తద్వారా పార్టీ ఒంటరిగా అయినా గెలిచే సామర్థ్యం ఉంటుందని ఆయన భావన. ఏ పార్టీ అయినా.. ఒంటరిగానే బలం పెంచుకునేందుకు ప్రయత్నిస్తుంది. కానీ, బీజేపీ విషయంలో ఆది నుంచి కూడా.. టీడీపీపై ఆధారపడుతున్న పరిస్థితి ఉంది. కానీ, ఇప్పుడు మార్పు దిశగా అడుగులు వేస్తు న్నారు. వేయాలని కూడా నిర్ణయించుకున్నారు. దీనికి ప్రధాన కారణం.. క్షేత్రస్థాయిలో కూటమి నేతల మధ్య సఖ్యత లేదన్న వాదన. ఇది వాస్తవమే. కానీ, దీనికి ఒక్క బీజేపీ మాత్రమే అతీతంగా ఉందా? అంటే... అది కూడా లేదు. బీజేపీ నేతలు గెలిచిన చోట కూడా.. వివాదాలు జరుగుతున్నాయి.

బీజేపీ ఎంపీలు ఉన్న నియోజకవర్గాల్లోనూ ఏకఛత్రాధిపత్యంగా రాజకీయాలు సాగుతున్నాయి. ఈ విషయాన్ని ముందుగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉంది. అలా కాకుండా.. ఇతర పార్టీలపై నెపం నెట్టి.. తాము మాత్రమే పవిత్రంగా ఉన్నామని చెప్పుకొనే ప్రయత్నం సరికాదు. ఇక, గ్రామ స్థాయిలో పార్టీ పుంజుకు నే విషయం కూడా అంత ఈజీ కాదు. మాధవ్ చెబుతున్నట్టు గ్రామీణ ప్రాంతాల్లో పుంజుకునేందుకు ముందు స్థానికంగా సభ్యత్వాలే లేవు. అనేక చోట్ల పార్టీ పేరు కూడా వినిపించడం లేదు. అందుకే.. గత చీఫ్‌లు మౌనంగా ఉన్నారు. కానీ, ఇప్పుడు మాధవ్ మాత్రం గీతోపదేశం బాగానే చేశారు. మరి ఏమేరకు పుంజుకుంటారో చూడాలి.

## ఇదెక్కడి వింత సీన్: మ్యాచ్ జరగాలనే ఆరాటం..
# పిచ్ ఆరకపోవడంతో మంట పెట్టారు




**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ మ్యాచ్ కు ముందు ఊహించని సీన్ ఒకటి చోటు చేసుకుంది. ఐసీసీ వరల్డ్ కప్ లీగ్ 2లో శుక్రవారం (ఆగస్టు 29) స్కాట్లాండ్, నమీబియా మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. కెనడాలో సిటీలోని ఒంటారియోలోని కింగ్ సిటీ వేదికగా మాపుల్ లీఫ్ నార్త్-వెస్ట్ గ్రౌండ్‌లో జరగాల్సిన ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు వర్షం అంతరాయం ఏర్పడింది. సాధారణంగా వర్షం పడితే మ్యాచ్ జరపడానికి గ్రౌండ్ స్టాఫ్ తెగ కష్టపడుతుంటారు. ఎప్పటికప్పుడూ వర్షం పడిన నీళ్లను తొలగించి గ్రౌండ్ సిద్ధం చేసే పనిలో ఉంటారు.

ఈ మ్యాచ్ కు ముందు ఒక విచిత్ర సీన్ అందరికీ షాకిస్తుంది. గ్రౌండ్ ఇంతకు ఆరకపోవడంతో వర్షం తర్వాత గ్రౌండ్ స్టాఫ్ వింత వ్యూహాలను అనుసరించారు. అప్పటికే భారీ వర్షంతో మ్యాచ్ ప్రారంభానికి ఆలస్యం అయింది. పలుమార్లు గ్రౌండ్ ను చెక్ చేసినా పిచ్ ఆరకపోవడంతో గ్రౌండ్ స్టాఫ్ ఏకంగా పిచ్‌కు నిప్పంటించారు. ఈ సీన్స్ అన్ని కెమారాలో రికార్డ్ అయ్యాయి. పిచ్ కు నిప్పంటించిన ఫోటోస్ ను స్కాట్లాండ్ క్రికెట్ బోర్డు సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్ గా మారాయి. మ్యాచ్ కట్ ఆఫ్ సమయం రాత్రి 9:02 గంటలకు కూడా గ్రౌండ్ సిద్ధం కాకపోవడంతో మ్యాచ్ రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. 2027 వన్డే ప్రపంచ కప్ సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియా

సంయక్తంగా ఆతిధ్యమివ్వనున్నాయి. నమీబియా 2027 ప్రపంచ కప్‌ను నిర్వహిస్తున్నా ఐసీసీ పూర్తి సభ్య దేశం కాకపోవడంతో ఈ మెగా టోర్నీకి అర్హత సాధించాలంటే క్వాలిఫయర్ మ్యాచ్ లు ఆడాల్సిందే. కెనడా, నమీబియా జట్ల మధ్య గతంలో జరిగిన మ్యాచ్ గమనిస్తే కెనడాను నమీబియా ఐదు వికెట్ల తేడాతో ఓడించింది

## జింబాబ్వేపై చివరి ఓవర్‌లో 10 పరుగులు.. హ్యాట్రిక్‌తో ఓడిపోయే మ్యాచ్ గెలిపించిన లంక పేసర్




**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంక, జింబాబ్వే జట్ల మధ్య శుక్రవారం (ఆగస్టు 29) హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో తొలి వన్డే. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక 298 పరుగుల భారీ స్కోర్. లంక బౌలింగ్ ధాటికి లక్ష్య ఛేదనలో పసికూన చిత్తవ్వడం గ్యారంటీ అనుకున్నారు. అందుకు తగ్గట్టు ఆతిధ్య జింబాబ్వే 161 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి మ్యాచ్ మీద ఆశలు వేదిలేసుకుంది. ఈ దశలో కెప్టెన్ సికిందర్ రజా (92), టోనీ మున్యోంగా (43) 128 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టును విజయతీరాలకు చేర్చారు. చివరి ఓవర్లో పది పరుగులు చేసి సంచలన విజయం అందుకోవడానికి జింబాబ్వే సిద్ధంగా ఉంది. మ్యాచ్ విన్నర్ రజా ఉండడంతో ఆతిధ్య జట్టు విజయంపై ధీమాగా కనిపించింది. ఈ దశలో శ్రీలంక ఫాస్ట్ బౌలర్ మధుశంక అద్భుతం చేశాడు. హ్యాట్రిక్ తీయడంతో పాటు ఈ ఓవర్ లో కేవలం రెండు పరుగులు మాత్రమే ఇచ్చి లంక జట్టుకు 7 పరుగుల విజయాన్ని అందించాడు. రజా, బ్రాడ్ ఎవాన్స్, న్గరవ లను తొలి బంతులకు ఔట్ చేసి హ్యాట్రిక్ ను తన ఖాతాలో వేసికొని మ్యాచ్ ను టర్న్ చేశాడు. చివరి మూడు బంతుల్లో కేవలం రెండు పరుగులు మాత్రమే ఇవ్వడంతో లంక జట్టు తృటిలో పసికూన నుంచి ఓడిపోయే ప్రమాదాన్ని తప్పించుకుంది. ఈ మ్యాచ్ గెలవడంతో మూడు వన్డేల సిరీస్ లో శ్రీలంక 1-0 ఆధిక్యంలో నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 298 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఓపెనర్ పాతుమ్ నిశాంక (76), లియాంగే (70), కామిందు మెండీస్ (57) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. లక్ష్య ఛేదనలో జింబాబ్వే 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 291 పరుగులకు పరిమితమైంది. బెన్ కరణ్ 70 పరుగులు చేసి టాపార్డర్ లో రాణించగా.. సికిందర్ రజా 92 పరుగులతో అసాధారణంగా పోరాడినా ఫలితం లేకుండా పోయింది. మధుశంకకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

## లీగ్ మారినా గొడవలు మానలేదు: నితీష్‌తో గొడవ..
# LSG స్పిన్నర్ మ్యాచ్ ఫీజులో భారీ జరిమానా




**హైదరాబాద్ పెన్ పవర్:** లక్నో సూపర్ జెయింట్స్ మిస్టరీ స్పిన్నర్ దిగ్వేష్ రాత్గ తన విచిత్ర ప్రవర్తనతో మరోసారి వార్తల్లో నిలిచాడు. ఐపీఎల్ 2025లో అద్భుతమైన బౌలర్ గా పేరు తెచ్చుకున్నా విచిత్ర ఆటిట్యూడ్ తో పలుమార్లు జరిమానాకు గురయ్యాడు. ప్రత్యర్థికి జట్లపై వికెట్ తీసిన ప్రతిసారి నోట్ బుక్ సెలెబ్రేషన్ చేసుకుంటూ పలుమార్లు నిషేధానికి గురయ్యాడు. అంతేకాదు ఐపీఎల్ 2025లో ఈ లెగ్ స్పిన్నర్ తన ఓవరాక్షన్ తో ఒక మ్యాచ్ నిషేధాన్ని ఎదుర్కొన్నాడు. ఇదంతా పక్కనపెడితే మరోసారి దిగ్వేశ్ ఢిల్లీ ప్రీమియర్ లీగ్ తన ఆటిట్యూడ్ తో చర్చనీయాంశంగా మారాడు.

స్టార్ బ్యాటర్ నితీష్ రాణాతో మాటల వాగ్వాదానికి దిగినందుకు, దిగ్వేష్‌కు అతని మ్యాచ్ ఫీజులో 80 శాతం భారీ జరిమానా విధించబడింది. అదే సమయంలో రాణా మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానా విధించబడింది. "ఆట స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించినందుకు ఆర్టికల్ 2.2 (లెవల్ 2) కింద ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు దిగ్వేష్ రతికి మ్యాచ్ ఫీజులో 80% జరిమానా విధించబడింది.ఆర్టికల్ 2.6 (లెవల్ 1) కింద ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు నితీష్ రాణాకు మ్యాచ్ ఫీజులో 50% జరిమానా విధించబడింది". అని శుక్రవారం మ్యాచ్ తర్వాత శనివారం (ఆగస్టు 30) మీడియా అడ్వైజరీలో ఢిల్లీ ప్రీమియర్ లీగ్ తెలిపింది. మ్యాచ్ సమయంలో వీరిద్దరూ అశ్లీలమైన, అభ్యంతరకరమైన సైగలు చేసుకున్నట్టు తేలిందని ఢిల్లీ ప్రీమియర్ లీగ్ చెప్పుకొచ్చింది. శుక్రవారం (ఆగస్టు 29) ఢిల్లీ ప్రీమియర్ లీగ్ లో భాగంగా వెస్ట్ ఢిల్లీ లయన్స్ కెప్టెన్ నితీష్ రాణా, సౌత్ ఢిల్లీ స్పిన్నర్ దిగ్వేష్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ మ్యాచ్ లో చెలరేగి ఆడుతున్న నితీష్.. దిగ్వేశ్ బౌలింగ్ లోనూ బౌండరీల వర్షం కురిపించాడు. రాత్ బౌలింగ్ లో రివర్స్ స్వీప్ షాట్ ఆడి సిక్సర్ కొట్టిన తర్వాత రాత్ కోపంగా నితీష్ ను ఏదో అన్నాడు. దిగ్వేశ్ మాటలకు ఫైర్ అయిన నితీష్ బ్యాట్ చూపిస్తూ ఏదో అన్నాడు. మాటా మాటా పెరగడంతో ఇద్దరి మధ్య గొడవ పెరిగింది. అంపైర్లు జోక్యం చేసుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొని వచ్చారు. ఈ మ్యాచ్ లో నితీష్ రాణా ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 55 బంతుల్లోనే 15 సిక్సర్లు, 8 ఫోర్లతో 134 పరుగులు చేసి వెస్ట్ లయన్స్ జట్టును సింగిల్ హ్యాండ్ తో గెలిపించాడు. మొదట బ్యాటింగ్ చేసిన సౌత్ ఢిల్లీ సూపర్ స్టార్జ్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 201 పరుగుల భారీ స్కోర్ చేసింది. అన్మోల్ శర్మ (55), తేజస్వి దహియా (60), సుమిత్ మాథుర్ (48లి) రాణించారు. నితీష్ విజృంభణకు లక్ష్య ఛేదనలో వెస్ట్ లయన్స్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.



# ఏఏ 22లో స్పెషల్ సర్‌ప్రైజ్ ఇతడే




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తున్న భారీ సైన్స్ ఫిక్షన్ చిత్రం శరవేగంగా చిత్రీకరణ పూర్తి చేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా కాస్టింగ్, సాంకేతిక నిపుణులు సహా దేనిలోను రాజీ అన్నదే లేకుండా అద్భుతగా ప్లాన్ చేస్తున్నారు నిర్మాతలు. ఈ భారీ ప్రయోగాత్మక చిత్రంలో బాలీవుడ్ అందాల కథానాయిక దీపిక పదుకొనే బన్ని సరసన నటిస్తోంది. తాజా సమాచారం మేరకు ఈ చిత్రంలో కోలీవుడ్ కమెడియన్ యోగిబాబు ఓ కీలక పాత్రను పోషిస్తున్నారు. ఇక ఇదే చిత్రంలో మృణాల్ ఠాకూర్ కూడా ఓ ముఖ్యమైన పాత్రను పోషిస్తోందని తెలిసింది. దీంతో యోగిబాబు, మృణాల్ ల పాత్రలు ప్రత్యేకత ఏమిటో తెలుసుకోవాలనే ఉత్సుకత అభిమానుల్లో పెరిగింది.ప్రభాస్ %-%కల్కి 2898 ఏడి%-% పాన్ ఇండియా కేటగిరీలో సంచలన విజయం సాధించింది. ఆ తర్వాత మళ్లీ ప్రణాళికా బద్ధంగా రూపొందిస్తున్న ఈ సినిమాకు నాన్ థియేట్రికల్, డిజిటల్ హక్కుల కోసం భారీ డిమాండ్ నెలకొంది. జవాన్ చిత్రంతో పాన్ ఇండియా మార్కెట్లో సత్తా చాటిన అట్లీ ఈసారి సైన్స్ ఫిక్షన్ కాన్సెప్టుతో భారీ ప్రయోగం చేస్తున్నాడు. షారూఖ్- అట్లీ కాంబినేషన్ మూవీ జవాన్ లో యోగిబాబు ఓ కీలక పాత్రను పోషించారు. ఆ తర్వాత మళ్లీ భారీ ప్రయోగాత్మక చిత్రంలో యోగిబాబు పాత్ర ఎలా ఉంటుందో చూడాలన్న ఆసక్తి నెలకొంది.

**ఆంచల్ ముంజాల్ శ్వేత సొగసులో గ్రేస్‌ను ప్రసరిస్తుంది**



**ధ్వని భానుశాలి తెలుపు రంగులో సొగసును ప్రసరిస్తుంది**

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com